ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 10 జూన్ 2025

మెట్రో రైలు కారిడార్‌లో మరో ముందడుగు

- రూ.6 వేల కోట్ల రుణ సాయం చేసేందుకు ఏఐఐబీ ఆసక్తి
- ఏఎంఆర్‌సీ ఎండీతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన

విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులో మరో అడుగు ముందుకుపడింది. ఈ ప్రాజెక్టుకు సాయం చేయడానికి ముందుకువచ్చిన ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ప్రతినిధులు క్షేత్ర పర్యటనకు వచ్చారు.

- వార్త 8వ పేజీలో

లోకేశ్‌కు ఘన స్వాగతం



విశాఖపట్నం విమానాశ్రయంలో మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు. పక్కన డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల ఉత్తరాంధ్ర పర్యటన నిమిత్తం సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్నారు. ఆయనకు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ప్రభుత్వ విప్ పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, పలువురు నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం లోకేశ్ రోడ్డు మార్గంలో పార్వతీపురం మన్యం జిల్లాకు బయలుదేరి వెళ్లారు. పార్వతీపురంలో షైనింగ్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న అనంతరం రాత్రి 10 గంటల ప్రాంతంలో విశాఖలోనిఇ టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. రాత్రికి అక్కడే బస చేశారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 12 మంది తహసీల్దార్లు బదిలీ

- అచ్చుతాపురం నుంచి అల్లూరి జిల్లాకు జనార్దన్
- అల్లూరి కలెక్టరేట్ నుంచి ముగ్గురు అనకాపల్లి జిల్లాకు రాక
- పెందుర్తి, ములగాడ తహసీల్దార్లు సైతం జిల్లాకు బదిలీ
- విశాఖలో గాజువాక, సీతమ్మధార, ఆనందపురం రెవెన్యూ అధికారులకు స్థానచలనం
- జడ్పీలో 75మందికి బదిలీ
- జలవనరుల శాఖలో 100 మంది...



విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం జిల్లాలో కీలకమైన ఆనందపురం, పెందుర్తి, గాజువాక తహసీల్దార్లపై బదిలీ వేటు పడింది. కీలకమైన పెందుర్తి తహసీల్దారుగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి వచ్చిన రామకృష్ణను నియమించారు. ఆనందపురం, గాజువాక తహసీల్దార్లుగా ఎవరినీ నియమించకుండా.. అక్కడ పనిచేస్తున్న డీటీలు చేతన్‌కుమార్, శ్రీనివాసరావులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అచ్యుతాపురం తహసీల్దారు జి.జనార్దన్ అల్లూరి జిల్లాకు బదిలీ అయ్యారు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా 12 మంది తహసీల్దార్ కేడర్ ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ మేరకు విశాఖ కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. విశాఖ జిల్లాలో పెందుర్తి, ఆనందపురం, గాజువాక, ములగాడ, సీతమ్మధార తహసీల్దార్లను బదిలీచేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఐదుగురు తహసీల్దార్లను విశాఖ, అనకాపల్లి జిల్లాలకు కేటాయించగా, అనకాపల్లి నుంచి ఒకరిని అల్లూరి జిల్లాకు, విశాఖ జిల్లా నుంచి ఇద్దరిని అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు.

జడ్పీలో 75మందికి బదిలీ

జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో ఎనిమిది కేడర్‌లలో 75మందిని బదిలీ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో పి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో జడ్పీ హాలులో బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. ఐదుగురు ఎంపీడీవోలు, ఐదుగురు ఏవోలు, నలుగురు ... మిగతా 8వ పేజీలో

బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు

అధికారి	పనిచేస్తున్న ప్రదేశం	బదిలీ అయిన స్థానం
1. ఎం.ఆనందకుమార్	పెందుర్తి	అనకాపల్లి జిల్లా
2. ఎం.భుజంగరావు	ములగాడ	అనకాపల్లి జిల్లా
3. బి.నాగరాజు	అల్లూరి కలెక్టరేట్	అనకాపల్లి జిల్లా
4. సీహెచ్.తిరుమలరాజు	అల్లూరి కలెక్టరేట్	అనకాపల్లి జిల్లా
5. ఎం.భాస్కర అప్పారావు	అల్లూరి కలెక్టరేట్	అనకాపల్లి జిల్లా
6. టి.రామకృష్ణ	అల్లూరి జిల్లా	పెందుర్తి మండలం
7. ఎంవీవీ. ప్రసాద్	అల్లూరి జిల్లా	భూపరిరక్షణ విభాగం, విశాఖ కలెక్టరేట్
8. బీవీ.రాణి	అనకాపల్లి కలెక్టరేట్	విశాఖ కలెక్టరేట్
9. జి.జనార్దన్	అచ్యుతాపురం	అల్లూరి జిల్లా
10 పి.శ్యాంప్రసాద్	ఆనందపురం	విశాఖ కలెక్టరేట్
11. టి.శ్రీవల్లి	గాజువాక	వీఎంఆర్‌డీఏ స్పెషల్ తహసీల్దారు
12. ఎం.రమేశ్	సీతమ్మధార	ములగాడ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నిత్య సాధనతో ప్రశాంత జీవనం

- కలెక్టర్ విజయకృష్ణన్
- కొత్తూరు బౌద్ధ ఆరామం వద్ద యోగాంధ్ర



కొత్తూరు బౌద్ధ ఆరామం వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, తదితరులు

రాంబిల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ముందస్తు సన్నాహాల్లో భాగంగా సోమవారం మండలంలో కొత్తూరు వద్ద వున్న బౌద్ధ ఆరామం (ధన దిబ్బలు) వద్ద యోగాంధ్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో యోగా నేర్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నదని, వయో, లింగభేదం లేకుండా ప్రజలంతా నిత్యం యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ప్రశాంత జీవన శైలి సొంతమవుతుందన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ యోగా చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని, యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రాచీన బౌద్ధ ఆరామం వద్ద యోగా కార్యక్రమం నిర్వహించడం ద్వారా ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు వస్తుందన్నారు. ఈ నెల 12న అచ్యుతాపురం ఎస్ఈజడ్‌లో నిర్వహించే జిల్లాస్థాయి యోగా కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనిఇ విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బౌద్ధ ఆరామం నుంచి కొత్తూరు గ్రామం వరకు యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీవో శిరీషారాణి, డీఎల్‌డీఓ మంజులావాణి, అనకాపల్లి ఆర్డీఓ ఆయిషా బేగమ్, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా పర్యాటక అధికారి కె.మనోరమ, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

3,360 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న విజిలెన్స్, పౌరసరఫరాల అధికారులు

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల శాఖల అధికారులు సోమవారం పట్టణంలోని గవరపాలెం పరదేశమ్మగుడి సమీపంలోని ఒక ఇంటిలో తనిఖీలు చేశారు. ఇక్కడ 70 బస్తాల్లో నిల్వ చేసిన 3,360 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గవరపాలేనికి చెందిన బి.శ్యామ్‌కుమార్ అనే వ్యక్తి, రేషన్ కార్డుదారుల నుంచి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు, వ్యాపారులకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు గుర్తించారు. అనంతరం బియ్యం సీజ్ చేసి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పౌరసరఫరాల శాఖ డీటీ లీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

నాలెడ్జ్ హబ్‌గా ఏపీ

ఆ దిశగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తీవ్ర కృషి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర
- తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు నేర్చాలని విద్యార్థులకు పిలుపు
- టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన 'షైనింగ్ స్టార్స్'కు పురస్కారాలు ప్రదానం



పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను నగదు పురస్కారాలతో సత్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర. చిత్రంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్‌కుమార్, కలెక్టర్ విజయకృష్ణన్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, డీఈవో అప్పారావునాయుడు, తదితరులు

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):

తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత విద్యార్థులపై వుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం రింగురోడ్డులోని ఒక కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' పేరుతో నగదు పురస్కారాలను మంత్రి అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేశాన్ని ముందుకు నడిపించే బాధ్యత యువతదేనని, ప్రపంచంలో ఏ దేశంలో చూసినా తెలుగువారు ఐటీ రంగంలో రాణిస్తున్నారని చెప్పారు. 2014-19 మధ్య నాటి సీఎం చంద్రబాబునాయుడు విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం వల్ల దేశంలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉండేదని, గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేయడం వల్ల 19వ స్థానానికి పడిపోయిందన్నారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలనే ఉద్దేశంతో నారా లోకేశ్ విద్యాశాఖకు కోరుకొని తీసుకున్నారని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామన్నారు.

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, బాగా చదువుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో నగదు అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ ... మిగతా 8వ పేజీలో

అమరావతి మహిళలను కించపరిచిన వాళ్లను కఠినంగా శిక్షించాలి



అనకాపల్లి పట్టణ సీఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, తెలుగు మహిళలు

- తెలుగు మహిళలు డిమాండ్
- జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేనిలపై పోలీసులకు ఫిర్యాదులు

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి మహిళలను కించపరిచేలా సాక్షి చానెల్ డిబేట్‌లో మాట్లాడిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులను అరెస్టు చేయడమే కాకుండా చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా కేసులు నమోదు చేయాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు ఆధ్వర్యంలో సాక్షి ప్రాంతీయ కార్యాలయం వద్ద, తరువాత పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలియజేశారు. అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లి పట్టణ సీఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, నేతలు శంకర్ల పద్మలత, పెదపాటి కల్యాణి, బత్తుల లక్ష్మి, కె.ఈశ్వరమ్మ, కె.సత్యవతి, ఎస్.అమరావతి, పి.తులసి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సాక్షి చానెల్ డిబేట్‌లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై ... మిగతా 8వ పేజీలో

భూమి రైతుకు నీటి కష్టాలు

- ఆనకట్ట కాలువలో పేరుకుపోయిన పూడిక, పెరిగిన తుప్పలు
- నీటి ప్రవాహానికి ఆటంకాలు
- ఆయకట్టుకు సరిగా నీరు అందక రైతుల ఇక్కట్లు



భూమి ఆనకట్ట వద్ద నదిలో పేరుకుపోయిన పూడిక



పిచ్చిమొక్కలతో మూసుకుపోయిన పంట కాలువ

పాయకరావుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తాండవ నదిపై పాయకరావుపేట వద్ద ఉన్న భూమి ఆనకట్ట కింద వున్న పంట కాలువల్లో పూడిక విపరీతంగా పేరుకుపోయింది. తుప్పలు బలిసిపోయాయి. దీంతో కాలువల్లో నీరు సరిగా ప్రవహించక ఆయకట్టు భూములకు నీరు అందని పరిస్థితి నెలకొంది. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ ప్రారంభం కానుండడం, ఇంతవరకు పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది.

పాయకరావుపేట వద్ద తాండవ నదిలో పూర్వం కాలంలో ఉన్న గోయిన్లను తొలగించి సుమారు రెండు దశాబ్దాల క్రితం భూమి, మురా ఆనకట్టలను నిర్మించారు. వీటి ద్వారా ఏటా ఖరీఫ్ సీజన్‌లో పాయకరావుపేట, నక్కపల్లి మండలాలతోపాటు కాకినాడ జిల్లా తుని మండలంలో సుమారు 18 వేల ఎకరాలకు నీరు అందాలి. భూమి ఆనకట్ట కింద పాయకరావుపేట, పీఎల్.పురం, సీతారాంపురం, నామవరం, నక్కపల్లి మండలం ఒడ్డిమెట్ట, దేవవరం, గొడిచెర్ల, ఉద్దండపురం ... మిగతా 8వ పేజీలో

టీడీపీ శ్రేణులు గీత దాటితే ఉపేక్షించను

- ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ
- ఇబ్బందులుంటే సమన్వయం చేస్తామని హామీ



టీడీపీ నాయకులు, కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

అచ్యుతాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ నిబంధనలు అధిగమించి ఒక్కడుగు ముందుకు వేసినా ఉపేక్షించేది లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన ఎలమంచిలి నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశానికి కంచుకోట అయిన ఎలమంచిలిలో పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించవలసి వచ్చిందన్నారు. వైసీపీ రాక్షస పాలనను అంతం చేయడానికి పొత్తులతో వెళ్లి చిత్తుచేశామన్నారు. అయితే ఇక్కడ టీడీపీ శ్రేణులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని, ఒకసారి కూర్చొని పరిష్కరించుకుందామన్నారు. అవసరమైతే మండలాల వారీగా టీడీపీ నాయకులతో సమావేశాలు ఏర్పాటుచేసుకుందామన్నారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఒక పరిస్థితి ఉంటే ఇక్కడ ఒక పరిస్థితి ఉందన్నారు. అచ్యుతాపురం సెజ్‌లో 200 పరిశ్రమలున్నా తెలుగుదేశం కార్యకర్తలకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఇక్కడ పరిశ్రమంలో వైసీపీ పాలన సాగుతున్నట్టుగానే ఉందన్నారు. అభివృద్ధి నిధులు పంచాయతీల్లో టీడీపీకి శ్రేణులకు రేషియో పద్ధతిలో కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి నిబంధనల ప్రకారం కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నా టీడీపీ శ్రేణులకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమై కూటమి కార్యకర్తలకు ఉపాధి కల్పించాలన్నారు.సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్, ధూళి రంగనాయకులు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, దాడి రత్నాకర్ పాల్గొన్నారు.

బ్రాండిక్స్ సంక్షేమ కార్యక్రమాలు ఆదర్శనీయం

- ఎంపీ సీఎం రమేశ్



బ్రాండిక్స్‌లో చిన్నారులకు బ్యాగ్‌లు పంపిణీ చేసిన దృశ్యం

అచ్యుతాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఆదర్శనీయమని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. సోమవారం బ్రాండిక్స్‌లో వంద మంది చిన్నారులకు జూనియర్ స్కాలర్‌షిప్, విద్యా సామగ్రి ఆయన అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వేలాది మంది ఉద్యోగులతోపాటు వారి పిల్లల భవిష్యత్తు కోసం ఈ సంస్థ చేపడుతున్న సంక్షేమ పథకాలు మంచివన్నారు. సంస్థకు ఏ సహాయ సహకారాలు కావాలన్నా తాను చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈసందర్భంగా బ్రాండిక్స్ ఉద్యోగులకు అమలు చేస్తున్న కార్యక్రమాలపై బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి వివరించారు.

విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభం

వర్చువల్‌గా దిశా నిర్దేశం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



ఎమ్మెల్యే విజయకుమార్, నియోజకవర్గ అధికారులతో వర్చువల్‌గా దిశా నిర్దేశం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎలమంచిలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ అతిథిగృహంలో సోమవారం విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. నియోజకవర్గ అధికారులతోపాటు ఎమ్మెల్యే విజయకుమార్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో సుమారు గంటన్నరకు పైగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా విజన్ యాక్షన్ ప్లాన్ గురించి దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా యాక్షన్ ప్లాన్ గురించి చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా లక్ష్యాన్ని సాధించేందుకు సమిష్టి కృషి చేసి నియోజకవర్గాన్ని ముందంజలో నిలిపేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఎంపీడీఓ కొండలరావు, నాలుగు మండలాలకు చెందిన అధికారులు, జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు.

సొంత నిధులతో కాలువ ఏర్పాటు



ఎస్సీ కాలనీలో కాలువ ఏర్పాటు చేసుకుంటున్న కాలనీవాసులు

పాయకరావుపేట రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకోట ఎస్సీ కాలనీవాసులు సొంత నిధులతో సోమవారం కాలువ ఏర్పాటుచేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సీ కాలనీలోని మురికినీరు బయటకు పోయేందుకు ఉన్న కాలువను ఇటీవల సమీప రైతులు పూడ్చివేశారన్నారు. దీంతో కాలనీలోని కాలువల్లో మురికినీరు బయటకు వెళ్లేందుకు వీలులేక ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్గంధం వచ్చేందన్నారు. అంతేకాకుండా దోమలు పెరిగి వ్యాధుల బారిన పడేవారమని వాపోయారు. దీనిపై పంచాయతీ, మండల స్థాయి అధికారులు చెప్పినా పట్టించుకోలేదని, చివరకు జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. దీంతో కాలనీలో పెద్దలంతా చర్చించుకుని విరాళాలు వేసుకొని పూడ్చివేసిన కాలువను తిరిగి ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులగపూరి అప్పలనర్స, కుందూరు కుమార్, మోజెజి వీరబాబు, విశ్వాసుల వీరబాబు, లోవరాజు, అప్పారావు, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

కోటవురట్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వరి విత్తన శుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చునని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత వి. ప్రసాద్ అన్నారు. సోమవారం కోటవురట్ల, చౌడువాడ గ్రామాలలో వికసిత్‌కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువు గొర్రుతో ఎదపెట్టడం వలన సాగుకయ్యే ఖర్చు తగ్గుతుందని, కూలీల కొరతను అధిగమించవచ్చునన్నారు. స్థానిక ఏవో సరోజిని మాట్లాడుతూ వరి నూతన రకాల ఎంటీయు 1224, ఎంటీయు 1262, ఎంటీయు 1318 వంగడాలతో సాగు చేస్తే రైతులు మంచి దిగుబడులు,సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పి. సూర్యారావు, వ్యవసాయ సహాయకులు ఈశ్వరీ, జ్యోతి, కుమార్ పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకులకు శిక్షణ



ఎండీఎం నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న ఎంఈవో నరేశ్

నక్కపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సోమవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో కె.నరేశ్ వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎండీఎం నిర్వాహకులు పలురకాల వంటకాలను తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో నరేశ్ మాట్లాడుతూ పాఠశాలలో వంట చేసే ప్రాంగణాన్ని పరిశుభ్రంగా వుంచాలని,పిల్లలకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని పెట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదన్నారు. హెచ్ఎం పతివాడ విజయ, సీఆర్‌పీలు అప్పారావు, శేఖర్, గంగేశ్వరరావు, దేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ సేవలకు అంతరాయం

రెండు రోజులుగా అవస్థలు పడుతున్న వినియోగదారులు

కోటవురట్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ సేవలు నిలిచిపోవడంతో మండలంలో పలుగ్రామాల్లో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతక సమస్యల కారణంగా ఫైబర్ సేవలు నిలిచిపోయాయని స్థానిక నిర్వాహకులు చెబుతున్నారు. ప్రతి వారంలో రెండు, మూడు రోజులు నెట్‌వర్క్ సేవలు నిలిచిపోవడంతో టీవీ ప్రసారాలకు అంతరాయడం ఏర్పడుతుందని వినియోగదారులు వాపోతున్నారు. నెట్‌వర్క్ సేవలు ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు పోతాయో.. తమకే తెలియదని కేబుల్ ఆపరేటర్లు చెబుతున్నారు. నెట్‌వర్క్ పనిచేయక ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్‌సరఫరా మాదిరిగానే గాలి వీచినా ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ సేవలు నిలిచిపోతున్నాయని వారంటున్నారు. దీంతో వినియోగదారులు జియో, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లకు మారిపోతున్నారు. ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ అధికారులు స్పందించి నెట్‌వర్క్ సేవలు వినియోగంలోకి తీసుకురావాలని వినియోగదార్లు కోరుతున్నారు.

లాలంకోడూరు ఉప సర్పంచ్‌పై నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాస సమావేశంలో ఉప సర్పంచ్‌కు వ్యతిరేకంగా చేతిలెత్తిన కూటమి సభ్యులు

రాంబిల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలంకోడూరు పంచాయతీలో వైసీపీకి చెందిన ఉపసర్పంచ్ రుత్తల గుణాకర్‌పై కూటమి వార్డుల సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. సోమవారం గ్రామ సచివాలయంలో ఆర్డీఓ షేక్ ఆయేషా బేగమ్ సమక్షంలో అవిశ్వాస సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన ఉప సర్పంచ్ గుణాకర్‌కు వ్యతిరేకంగా ఏడుగురు కూటమి సభ్యులు చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్టు అధికారులు ప్రకటించారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్ వారికి పంపించనున్నట్టు ఆర్డీఓ ఆయేషా బేగమ్ తెలిపారు. కాగా ఈ పంచాయతీకి సర్పంచ్‌గా ఉన్న లాలం రమణమూర్తి మృతి చెందడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న గుణాకర్‌కు ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించారు. అయితే గుణాకర్‌కు, కూటమి వార్డు సభ్యులకు సఖ్యత లేకపోవడంతో ఆయనకు వ్యతిరేకంగా అవిశ్వాసం పెట్టారు. అవిశ్వాసం నెగ్గినందున మరోసారి పంచాయతీ సమావేశం ఏర్పాటు చేసి ఉప సర్పంచ్‌ను ఎన్నుకోవలసి ఉంటుంది. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ రాజు, వార్డుల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు ప్రదానం



మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న మునగపాక మండల విద్యార్థులు



మంత్రి కొల్లు రవీంద్ర నుంచి ప్రతిభా పురస్కారం పొందుతున్న ఉపమాక విద్యార్థి బద్ది జయ కృష్ణ వంశీ

మునగపాక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్న ఆరుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో అవార్డులు అందుకున్న వారిలో మునగపాక జడ్పీ స్కూల్ విద్యార్థిని మండల టాపర్ ఆడారి లక్ష్మీగణేష్ (586), ఆడారి మౌనిక అన్నపూర్ణ, తోట మమతాశ్రీ, జి.నిర్మలకుమార్, నందవరపు భవిశ్రీ, పొట్ల నవదీప్ సూర్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతులు మీదుగా అందుకున్నారన్నారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.20వేలు నగదు, మెడల్, ప్రశంసా పత్రం అందజేశారన్నారు.

నక్కపల్లిలో..

పదో తరగతిలో ఉత్తమ మార్కులు వచ్చిన విద్యార్థులకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రతిభా పురస్కారాలను మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్ అందజేశారు. ఉపమాక గ్రామానికి చెందిన బద్ది జయకృష్ణ వంశీ(571), వేంపాడుకు చెందిన కొయ్య విద్యా సాగర్ (588), పోతంశెట్టి గన్నెమ్మ (577), నక్కపల్లికి చెందిన బొడ్డు నాగ స్వాతి (577),మామిడి గాయత్రి (576), గురుకులం పాఠశాలలో చదువుకున్న చీడిపల్లి వైష్ణవీ కీర్తి (514) కూడా ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. విద్యార్థులను ఆ గ్రామాల పెద్దలు అభినందించారు.

యోగాపై అవగాహన ర్యాలీలు



ఎలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు, సిబ్బంది

ఎలమంచిలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో యోగాపై అవగాహన ర్యాలీని సోమవారం మునిసిపల్ అధికారులు, సిబ్బంది నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మునిసిపల్, మెప్మా అధికారులు, సచివాలయ సిబ్బంది మునిసిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి యోగాపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో మెప్మా ప్రతినిధి పద్మ, సచివాలయ సిబ్బంది, ఆర్‌పీలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పాయకరావుపేటలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేటలో..

యోగాపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం అధికారులు, నాయకులు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. పీఆర్ గెస్టుహౌస్ నుంచి ప్రారంభించిన ఈ ర్యాలీలో ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, టీడీపీ నేతలు బొంది కాశీవిశ్వనాథం, మజ్జూరి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.రమాకుమారి, వార్డు సభ్యురాలు నారపురెడ్డి పద్మ, మండల పరిషత్ కార్యాలయ ఏఓ వర్మ, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శివరామ్ పాల్గొన్నారు.

విత్తన ఎంపికతోనే అధిక దిగుబడులు

రాజమండ్రి వాణిజ్య పంటల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త ప్రభాకర్



ఉప్పరాపల్లిలో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకర్

ఎస్.రాయవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తన ఎంపికతోనే అధికంగా దిగుబడులు వస్తాయని రాజమండ్రి వాణిజ్య పంటల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకరరావు అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సర్వసిద్ధి, ఉప్పరాపల్లి గ్రామాల్లో శాస్త్రవేత్తలు, అధికారులు పర్యటించారు. బీసీటీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకరరావు మాట్లాడుతూ వరిలో అయినా. కొబ్బరిలోనైనా విత్తన ఎంపిక చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం శివ, మండల వ్యవసాయాధికారిణి సౌజన్య, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్, సర్పంచులు కురందాసు గణేష్, సేనాపతి శ్రీరాములు, టీడీపీ నాయకులు తుంపాల నాగేశ్వరరావు, పడమర సతీష్, గుండుబోతుల గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

'పరిహారం ఇవ్వకుండా తోటల తొలగింపు అన్యాయం'

నక్కపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేటలో ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పేదలు సాగు చేసుకుంటున్న డీ పారం, సాగు భూముల్లోని తోటలకు ఎటువంటి పరిహారం ఇవ్వకుండా తొలగించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆవేదన వెలిబుచ్చారు. సోమవారం రాజయ్యపేటలో యంత్రాలతో తోటలను తొలగిస్తున్న ప్రాంతానికి అప్పలరాజు, మాజీ సర్పంచ్ పిక్కి శ్రీను చేరుకున్నారు. పరిహారం ఇవ్వకుండా పోలీస్ బందోబస్తుతో తోటలను ఎలా తొలగిస్తారని సీపీఎం నేత అప్పలరాజు డిమాండ్ చేశారు. తక్షణమే పరిహారం చెల్లించాలని, ఆ తరువాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నేత అప్పలరాజు

మంత్రి లోకేశ్‌ని విశాఖలో కలిసిన ప్రగడ



మంత్రి లోకేశ్‌ని కలిసిన ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట మంత్రి నారా లోకేశ్‌ని రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సోమవారం విశాఖ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఎలమంచిలి నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి, అభివృద్ధి చేయాల్సిన పనుల గురించి వివరించారు.

వ్యవసాయ శాఖ స్టాల్స్ సందర్శన

రాంబిల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు భౌద్ధారామం వద్ద వ్యవసాయ శాఖాధికారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు అధిక దిగుబడులు సాధించేలా అవగాహన కల్పించాలన్నారు. రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న యంత్రాలు, పనిముట్లను కూడా రైతులకు చేరువ చేయాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మురకాడ గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ రైతుమిత్ర సీహెచ్‌సీ సంఘానికి రూ.9.8లక్షల విలువ చేసే వ్యవసాయ డ్రోన్‌ను 80 శాతం రాయితీపై కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే విజయకుమార్‌లు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి సి.సుమంత, కూటమి నాయకులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, బైలపూడి శ్రీరామరాజు, పలువురు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిగా తాతబ్బాయి



ఎస్.రాయవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉప్పలం క్లస్టర్‌లో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిగా చల్లపల్లి తాతబ్బాయి అలియాస్ దత్తుడుని నియమించినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు దత్తుడుకు ఐదు వేల ఓటింగ్‌కు సంబంధించిన యూనిట్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించామన్నారు. అనంతరం తాతబ్బాయి మాట్లాడుతూ హోం మంత్రి అనిత గ్రామస్థాయిలో పార్టీకి సేవలందించిన తన లాంటి నాయకులను గుర్తించి పదవుల ద్వారా తగిన గౌరవాన్ని ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

12,13 తేదీల్లో కోదండరామస్వామి భూముల కౌలుకు వేలం పాట

కోటవురట్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామస్వామి దేవస్థానానికి చెందిన భూముల కౌలు వేలం పాటను 12వ తేదీన దేవదాయ శాఖ అధికారులు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. దేవస్థానానికి చెందిన సర్వే నంబరు 28లో ఉన్న 7 ఎకరాలకు ఆ రోజు ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తారని, మూడేళ్ల కౌలుకు ఇవ్వనున్నట్టు కమిటీ పేర్కొంది. అలాగే ఈనెల 13వ తేదీన ఉదయం 11 గంటలకు కోటవురట్ల సర్వే నంబరు 100-3, సర్వే నంబరు 363ల్లోని 9.30 ఎకరాలకు కౌలు వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు రెండు రోజులు జరిగే వేలం పాటకు హాజరు కావాలని కమిటీ కోరింది.

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

అచ్యుతాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. సోమవారం అచ్యుతాపురం జంక్షన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ని కాపాడుతామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాటలు నీటి మూటలుగా మారాయన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మునగపాకలో వరి విత్తనాల పంపిణీ

మునగపాక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం రైతులకు సబ్సిడీ వరి విత్తనాలను ఎంపీపీ మళ్ల జయమ్మ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం పంపిణీ చేశారు. ఖరీఫ్ రైతులకు సబ్సిడీవిత్తనాలు అందుబాటులో ఉన్నాయని గ్రామ వ్యవసాయ సహాయకురాలు గౌరీ సింధూజ తెలిపారు.

'ఆర్ఆర్ ప్యాకేజీలో అనర్హుల పేర్లు తొలగించాలి'

నక్కపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భూములిచ్చిన నిర్వాసిత రైతుల ఆర్ఆర్ ప్యాకేజీ జాబితాల్లో ఉన్న అనర్హుల పేర్లను వెంటనే తొలగించాలని అమలాపురం ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ నర్సింహమూర్తికి ఫిర్యాదు చేశారు. వేంపాడు రెవెన్యూ పరిధిలో ఆర్ఆర్ ప్యాకేజీ జాబితాలో ఇద్దరు అనర్హుల పేర్లను తొలగించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర పరిశీలన చేస్తామని తహసీల్దార్ నర్సింహమూర్తి చెప్పారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 120 మందికి పరీక్షలు

ఎస్.రాయవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సైతారుపేటలో సోమవారం బీసీటీ సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరంలో 120 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 12 మందికి ఆపరేషన్లు అవసరమవుతాయని గుర్తించారు. వీరికి విశాఖ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ చేస్తామని ఆ ఆస్పత్రి క్యాంప్ కో-ఆర్డినేటర్ సాయికృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రావి రమణబాబు, కార్యాచరణ కమిటీ సభ్యులు వీసం అప్పలస్వామినాయుడు, వీసం కోటిబాబునాయుడు, విశాఖ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలి చెల్లించాలి

రాంబిల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమిలి గ్రామంలోని ఉపాధి కార్మికులకు మూడు నెలల కూలిని తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండలంలోని దిమిలి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబాలు పోషించుకోవడం కోసం ఎండను సైతం లెక్కచేయకుండా ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు కూలి చెల్లించకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు.

మోదీ పాలనలో ఆర్థికంగా ఎదిగిన భారత్



స్వీట్లు పంచుకుంటున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

అచ్యుతాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో భారతదేశం ఆర్థికంగా ప్రపంచపటంలో నాలుగో స్థానానికి ఎదిగిందని బీజేపీ ఎలమంచిలి ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు అన్నారు. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పప్పు ఈశ్వరరావు, అగ్గాల హనుమంతరావు, పల్లి రాజుబాబు, మేరుగు కాసుబాబు, కె.చిన్నారావు పాల్గొన్నారు.

ఎంపీ రమేశ్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఉదారత

▸ మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం ప్రకటన



అచ్యుతాపురం మండలానికి చెందిన షైనింగ్ స్టార్స్ అవార్డు గ్రహీత లోహిత్‌కుమార్ తల్లికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా సోమవారం జరిగిన షైనింగ్ స్టార్స్ -2025 కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఉదారతను చాటుకున్నారు. అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన దళిత విద్యార్థి ఎస్.లోహిత్‌కుమార్ పదో తరగతి పరీక్షల్లో 600కి 560 మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యాడు. అయితే అచ్యుతాపురం సెజ్ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెల రోజుల పాటు విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలిసి ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఆ కుటుంబానికి ఎంపీ సీఎం రమేశ్ లక్ష రూపాయలు, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ రూ.50 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ర్యాలీ



వాడచీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు

పరవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరుతూ మేజిక్ బస్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వాడచీపురుపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్ కమిటీ మాజీ చైర్మన్ పెదపాటి పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాం, షూస్ వంటివి అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మేజిక్ బస్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు గాయిత్రి, స్వప్న, వసంత, నిర్మల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బకాయి వేతనాల కోసం ఉపాధి కూలీల ఆందోళన

పరవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : బకాయిపడిన తొమ్మిది వారాల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం కూలీలు మడకపాలెంలోని పని ప్రదేశంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కూలీల్లో ప్రతి కుటుంబానికి ఏడాదికి రెండు వందల రోజులు పనిదినాలు కల్పించాలని, కొలతలతో సంబంధం లేకుండా జీవో ప్రకారం రోజుకు రూ.309 వేతనం చెల్లించాలని, పనిముట్లు ఉచితంగా సరఫరా చేయాలని వారంతా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఉపాధి హామీ పథకం కూలీలు రామునాయుడు, అచ్చియ్యమ్మ, వరలక్ష్మి, సత్యవతి, లక్ష్మి, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు సంఘీభావంగా నిరసన



నెహ్రూచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న యూనియన్ల నాయకులు

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు సంఘీభావంగా సోమవారం ఇక్కడి నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ ప్రతినిధులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యల్లో భాగంగానే కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ఇటువంటి చర్యలను మానుకుని, తొలగించి కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.పరమేశ్వరరావు, బి.అప్పారావు, కె.అప్పారావు, టి.సురేష్, ఈశ్వరరావు, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ కూరగాయల కొనుగోలుకు జనం ఆసక్తి

సబ్బవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విభాగం అధ్వర్యంలో ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సేంద్రీయ కూరగాయల స్టాల్‌కు ఆదరణ పెరుగుతోంది. వివిధ శాఖల కార్యాలయాలకు వచ్చి వెళుతున్న ప్రజలతో పాటు అయా సిబ్బంది వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కూరగాయలు, ఆకు కూరలు తాజాగా ఉండడంతో పాటు, ఎటువంటి రసాయన ఎరువులు వినియోగించకుండా పండిస్తున్నందున వీటిని ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు. గిరాకీ ఎక్కువైతే స్టాల్స్ పెంచి వారంలో రెండు రోజుల నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని ఉద్యాన పంటల విభాగం సిబ్బంది సత్యవతి తెలిపారు.

'దళితుల హక్కులకు భంగం కలిగిస్తుండడం తగదు'



నినాదాలు చేస్తున్న దళిత హక్కుల సంఘం నాయకులు

తుమ్మపాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మత మార్పిడి చేసుకున్న క్రైస్తవులు దళితుల హక్కులకు భంగం కలిగిస్తున్నారని హిందూ షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బోని గణేశ్ ఆరోపించారు. అనకాపల్లి పట్టణంలోని పూల్‌బాగ్ రోడ్డులో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కొంతమంది క్రైస్తవులు ఎలాంటి అనుమతులు లేకుండా దళితవాడల్లో చర్చిలను ఏర్పాటు చేసి, మత మార్పిడిలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దేవుడు పేరుతో మత విద్వేషాలను రెచ్చగొడుతూ దళితుల మధ్య తగాదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. 75 ఏళ్లుగా నిజమైన హిందువులుగా జీవిస్తున్న దళితులు విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజ్యాధికారాలను కోల్పోయి నేటికీ నిరుపేదలుగానే జీవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో దళితుల నుంచి క్రైస్తవ మతం స్వీకరించిన వారిని గుర్తించి, వారిని బీసీ-సిగా పరిగణించి దళితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు మైలపల్లి పోతురాజు, అంగులూరి ఈశ్వరరావు, గంగాధర్, మరియమ్మ, గెంజి రమణ, భాస్కరరావు పాల్గొన్నారు.

అందం చెదిరిన అన్నమయ్య పార్కు

▸ నాడు కోలాహలం ▸ ఆటల పరికరాల వద్ద పిల్లల సందడి ▸ నేడు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం దర్శనం ▸ కళావిహీనంగా మారడంతో ప్రకృతి ప్రేమికులు ఆవేదన

ఆహ్లాదకరానికి ఆ ప్రాంతం అడ్రస్.. ఓవైపు గలగల పారే శారదా నది.. ఆ ఒడ్డునే పచ్చదనం తళుకులు. అందులో ఉయ్యాల, జారుడుబల్ల, రంగుల రాట్నం తదితర ఆటల పరికరాలు. వీటికితోడు చీకటి పడితే విద్యుత్ కాంతుల ధగధగలు.. వెరసి ఎప్పుడు చూసినా కోలాహల వాతావరణం. పదేళ్ల క్రితం వరకు అనకాపల్లి పట్టణంలోని అన్నమయ్య పార్కు వైభవం ఇది. కానీ నేడు భిన్నమైన వాతావరణం. ఎటుచూసినా చెత్తాచెదారం, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, కుప్పల్లా పేరుకుపోయిన డెబ్రిస్. ఈ ప్రాంతాన్ని చూసేవారికి ఒప్పుడు ఇది పార్కు అని చెబితేగానీ తెలియలేనంత కళావిహీనం.



కళావిహీనంగా మారిన పార్కులో పిచ్చిమొక్కల నడుమ ఉన్న అన్నమయ్య విగ్రహం



పార్కుకు వెళ్లే మార్గంలో చెత్తాచెదారం



పార్కు మార్గంలో డెబ్రిస్

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి ఆనుకొని శారదానది ఒడ్డున గల అన్నమయ్య పార్కు అధ్వానంగా మారింది. ఒకప్పుడు పిల్లలు, పెద్దలతో నిత్యం కళకళలాడిన ఈ పార్కు ప్రస్తుతం పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం, డెబ్రిస్ తదితరాలతో కళావిహీనంగా దర్శనమిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పార్కును అభివృద్ధి చేస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటించారు. కానీ ఐదేళ్లలో ఇది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత పాలకులు కూడా ఈ పార్కును పునర్నిర్మిస్తామని చెప్పి ఏడాది కావస్తున్నా నేటికీ అడుగు ముందుకు పడలేదు. దీంతో సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో సరదాగా చక్కని వాతావరణంలో గడిపేందుకు ఆహ్లాకరమైన పార్కు సౌకర్యం లేక పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంత్రిగా ఉన్న సమయంలో శారదానది ఒడ్డున సుమారు రూ.25 లక్షలతో ఈ పార్కు నిర్మాణం చేపట్టారు. కొంతకాలానికి భక్తులు అన్నమయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పదేళ్ల క్రితం వరకు ఈ పార్కును అన్నమయ్య పార్కుగా అందరూ తలచేవారు. అయితే అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో శారదా నదిపై పాత వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించారు. నాటి నుంచి ఈ పార్కుకు ఆదరణ కరువై నామరూపాలు లేకుండా పోయింది. ఇక్కడ ఉండే అన్నమయ్య విగ్రహం చుట్టూ తుప్పలు పేరుకుపోయాయి. పరసరాలవారు చెత్తాచెదారాన్ని వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లోని ఇళ్లకు సంబంధించి డెబ్రిస్‌ను ఇక్కడ పారబోస్తున్నారు. దీంతో ఈ పార్కు కళావిహీనంగా మారింది. పార్కును అభివృద్ధి చేయాలని పలు సంఘాలు జీవీఎంసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పార్కులోని చెత్తాచెదరాన్ని తొలగించడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దాలని పట్టణవాసులంతా కోరుతున్నారు.

పల్లపు సోమవరంలో 'మాటా- మంతి'

▸ హాజరైన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా

▸ సమస్యలు తెలియజేసిన గ్రామస్థులు ▸ పరిష్కారానికి హామీ



నేల కూర్చొని గ్రామస్థుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కొణతాల

కశింకోట, జూన్ 9 (ఆంధ్రజోతి) : ఎన్టీఆర్ స్ఫూర్తితో 'పల్లె పిలుస్తోంది రా.. కదలి రా..' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో సోమవారం రాత్రి 'గ్రామస్థులతో మాట- మంతి' నిర్వహించారు. ఈ సందర్భంగా అందరితో కలిసి నేలపై కూర్చొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు పరిష్కార చూపడంతో పాటు గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. తొలుత ఆయన గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

సబ్బవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 10 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో పి. పద్మజ సోమవారం తెలిపారు. తొలిరోజు సబ్బవరం-4 సచివాలయం, అమృతపురం, 11న గొటివాడ, అంతకాపల్లి, 12న సబ్బవరం-3, తవ్వవానిపాలెం, వంగలి. 13న సబ్బవరం-1, 24న అసకపల్లి, గుల్లేపల్లి, 25న ఆరిపాక, బంగారమ్మపాలెం, గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, 26న నారపాడు-1, నారపాడు-2, గుల్లేపల్లి, 27న అసకపల్లి, పైడివాడఅగ్రహారం, గుల్లేపల్లి గ్రామాల్లో ఈ శిబిరాలు కొనసాగుతాయని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాల్సివాలని కోరారు.

యోగాపై అవగాహన ర్యాలీలు



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ అధికారులు, సిబ్బంది



సబ్బవరం మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో...

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ ఆధ్వర్యంలో యోగాంధ్రపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గుండాల జంక్షన్ సమీపంలోని ఎస్ఆర్ శంకరన్ భవనం నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీ సాగించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ యోగా వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వై.సంతోష్ కుమార్, యోగా గురువులు, సచివాలయ సిబ్బంది, జోనల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఆర్టీసీ డిపో గ్యారేజీలో యోగాంధ్ర నిర్వహించారు. ఎఫ్ఎం మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గ్యారేజీ కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఎం మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజులో కొద్ది సమయం యోగాకు కేటాయించాలని సూచించారు.

సబ్బవరంలో...

సబ్బవరం : ఆరోగ్యానికి యోగా చక్కని మార్గమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. యోగాంధ్రలో భాగంగా ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ జంక్షన్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవన విధానంలో యోగా నిత్యం భాగం కావాలన్నారు. ఎంపీడీవో పి.పద్మజ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఏవో శివరామప్రసాద్, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు కొల్లి కృష్ణ, పల్ల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాలయంలో క్యాంటీన్ ప్రారంభం

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను సోమవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాలయం సిబ్బందికి, రోగులు, వారి సహాయకులకు అవసరమైన ఆహార పదార్థాలను ఈ క్యాంటీన్‌లో సరసమైన ధరలకు ఎస్‌హెచ్‌జీ మహిళా గ్రూపుల ద్వారా అందజేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు తాడి శాంతికుమారి, ఆళ్ల రామ చంద్రరావు, ఉల్లింగల రమేష్, గొర్లి శేఖర్, జిల్లా సమాఖ్య పాలక, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి'

తుమ్మపాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్ కోరారు. ఈ మేరకు సోమవారం జర్నలిస్టులతో కలిసి ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్టుల చట్టాలను తక్షణమే పునరుద్ధరించాలన్నారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రతను కల్పించడంతో పాటు వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్లు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫెడరేషన్ ప్రతినిధులు సీహెచ్.శశికుమార్, పీలా నాగశ్రీనివాస్, అజయ్, శేఖర్, గణేశ్, గంటా శ్రీను, సురేష్, నాగు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ సిబ్బందికి కనీస వేతనాల అమలుకు వినతి



డీఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న సత్యనారాయణ

తుమ్మపాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వేతన కార్యదర్శులు, సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని డెయిరీ వేతన కార్యదర్శులు, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఆర్‌వో సత్యనారాయణరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెయిరీ సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించడంతో పాటు గతంలో యాజమాన్యంతో చర్చలు జరిపిన సమయంలో 20 శాతం వేతనాలు పెంచుతామని చెప్పి నేటికీ అమలు చేయలేదని, ఆ సమస్య కూడా పరిష్కరించాలని విన్నవించారు. అంతేకాకుండా వేతన కార్యదర్శులను, సిబ్బందిని డెయిరీ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, సీపీఐ నాయకులు వైఎన్ భద్రం, గంగుపాం కనకారావు, కరక సోమునాయుడు, సూర్యారావు, శరగడం ప్రసాద్ పాల్గొన్నారు.

స్టేషన్ రోడ్డు అభివృద్ధికి ఎమ్మెల్యే కొణతాలకు వినతి

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అసంపూర్తిగా నిలిచిపోయిన స్టేషన్ రోడ్డు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయించాలని స్టేషన్ రోడ్డు భవన యజమానులు సోమవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. చిన నాలుగురోడ్ల జంక్షన్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు 50 అడుగుల రోడ్డు విస్తరణకు వ్యాపారులు, భవన యజమానులు అందరూ భాగస్వాములై సహకరించామన్నారు. జీవీఎంసీ కూడా తమకు నష్టపరిహారం అందజేసినట్టు చెప్పారు. కొంత మందికి ఇంకా టీడీఆర్‌లు ఇవ్వాల్సి ఉందని, వాటిని కూడా ఇచ్చి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయించాలని కోరారు. రోడ్డు అభివృద్ధి చేయకపోవడం వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెనుమత్స సత్యసాయిరాజు, యల్లంకి సత్తిబాబు తదితరులు వివరించారు.

'సమస్త జీవరాశులను కాపాడుకుందాం'



అవగాహన రాలీలో రత్నంతో పాటు ఎన్‌సీసీ అధికారులు, కేడెట్లు

సబ్బవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విశ్వంలో ప్రతి జీవరాశిని కాపాడు కోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పిలుపునిచ్చారు. సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఆవరణలో కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాంపును సోమవారం సందర్శించిన ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిక్షణకు అంతా కంకణ బద్ధులు కావాలన్నారు. ఇందుకోసం నిరక్షరాస్యులను చైతన్యవంతులన చేయాలని కోరారు. ఎన్‌సీసీ సుబేదార్, మేజర్ పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం అంతా కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిమ్ ప్రభాత్, సుబేదార్ సుజన్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

లంకెలపాలెం బంక్ సమీపంలో తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు వెనుకభాగం

లంకెలపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి లంకెలపాలెం పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం పెను ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించి స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలివి. స్థానికంగా గల ట్రాన్స్‌పోర్టు చెందిన లారీని డ్రైవర్ రంజిత్‌కుమార్ నిర్లక్ష్యంగా ఇంజన్ ఆన్‌చేసి రహదారి పక్కనే నిలిపి వెళ్లాడు. ఆ లారీ బాలార్క హోటల్ సమీపంలో పార్కు చేసిన కారు, ఆటో, ద్విచక్ర వాహనాలను ఢీకొని దూసుకుపోయింది. ఈ ఘటనలో ఆయా వాహనాలు దెబ్బతిన్నాయి. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో ఆ సమయంలో ఎవరూ అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి యూట్యూబర్ ఆర్థిక సాయం

కొత్తూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అనకాపల్లి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూ యెన్సర్ ఐ లవ్ అనకాపల్లి పేజీ క్రియేటర్ యెన్నేటి నారాయణ రావు కుటుంబాన్ని యూట్యూబర్ హర్షసాయి సోమవారం పరామర్శించారు. గవరపాలెం దాసరిగెడ్డ రోడ్డు పల్ల వువీధి బంగ్లాకు చెందిన అతని ఇంటికి వెళ్లి జరిగిన ఘటనను తెలుసుకున్నారు. అనంతరం రూ.లక్షా 50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

మంత్రి నారా లోకేశ్‌కు జిల్లా నేతలు స్వాగతం



లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ సీఎం రమేశ్, మంత్రి అనిత, మాజీ ఎమ్మెల్యే పీలా, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ నగరానికి సోమవారం చేరుకోవడంతో విమానాశ్రయంలో ఆయనకు పలువురు అనకాపల్లి జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. ఎంపీ సీఎం రమేశ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బుద్ధ నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్ తదితరులు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సత్కరించారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం

▸▸ ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ గౌరీశంకరరావు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న గౌరీశంకరరావు

పాడేరురూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాల మెరుగుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు అన్నారు. సోమవారం స్థానిక ఏపీఆర్ గురుకుల కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో ద్వితీయ ఇంటర్ విద్యార్థినులకు యోగాంధ్రపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థినీ యోగాపై కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. యోగాను దినచర్యగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.ధనలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ కె.రామలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీవో పి.సితార, తెలుగు అధ్యాపకురాలు బి.భవాని, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో-ఆర్డినేటర్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలి'



ఏరియా ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు

చింతపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు విధిగా ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.వాసవి అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 209మంది గర్భిణులకు ఆమె వైద్యపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేశారు. ఈ సందర్భంగా స్త్రీ వైద్యనిపుణురాలు వాసవి మాట్లాడుతూ గర్భిణులు తొమ్మిది నెలల్లో ఒక్కసారైన స్కానింగ్ చేయించుకోవాలన్నారు. స్కానింగ్ చేయించుకోవడం వల్ల ప్రమాదకరమైన ప్రసవాలను ముందుగా గుర్తించవచ్చునన్నారు. పురిటినొప్పులు ప్రారంభమైన తరువాత ఆస్పత్రికి తరలించడం కంటే గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందుగా చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో చేరాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనాలు



గర్భిణులకు భోజనాలను అందిస్తున్న వైద్యులు జ్ఞానేశ్వరి, జాహ్నవి

అనంతగిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 70 మంది గర్భిణులకు మాతృభూమి సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జ్ఞానేశ్వరి మాట్లాడుతూ ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులు సాధారణ తనిఖీలు వస్తుంటారని, వారికి ఈ నెల మాతృభూమి సేవా సంస్థ ప్రతినిధులు భోజనాలు పెట్టడం అభినందనీయమని చెప్పారు. మాతృభూమి సేవా సంస్థ అల్లూరి జిల్లా ఇన్‌చార్జి నగేశ్ మాట్లాడుతూ ప్రతి నెలా సుదూర ప్రాంతాల నుంచి గర్భిణులు తనిఖీలు కోసం వస్తుంటారని, వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని భోజనం కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మరో వైద్యాధికారి జాహ్నవి, ఎంపీహెచ్ఈవో నరసింగరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పి.మాకవరానికి రామానుజ జీయర్‌స్వామి రాక రేపు

కొయ్యూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమాకవరం గ్రామానికి ఈనెల 11తేదీన త్రిదండి చిన్నజీయర్ స్వామి వికాస తరంగిణి ట్రస్టుకు చెందిన త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి వస్తున్నట్టు ధార్మిక సంస్థల సేవ ప్రతినిధి డీవీడీ ప్రసాద్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మాకవరంలో నిర్మాణంలో ఉన్న మోదకొండమ్మ ఆలయాన్ని సందర్శిస్తారన్నారు. భక్తులు విచ్చేసి స్వామివారు ఇచ్చే తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

ఆదివాసీ ట్రస్టు అక్రమాలపై విచారణ చేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

డుంబ్రిగుడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ట్రస్టు అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారయణ డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆదివాసీ ట్రస్టు పేరుతో అమాయక గిరిజనల నుంచి గుర్తింపు కార్డులతో పాటు సభ్యత్వం పేరుతో రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ప్రతినిధులు వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక గిరిజనులతో కల్లబొల్లి మాటాలను కలిపి రూ.కోట్లలో వసూలు చేశారని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి ట్రస్టు అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు డొంబు, సభ్యులు వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి'

తుమ్మపాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్య క్షుడు బి.వెంకటేష్ కోరారు. ఈ మేరకు సోమవారం జర్నలిస్టులతో కలిసి ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్టుల చట్టాలను తక్షణమే పునరుద్ధరించాలన్నారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రతను కల్పించడంతో పాటు వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్లు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫెడరేషన్ ప్రతినిధులు సీహెచ్.శశికుమార్, పీలా నాగశ్రీనివాస్, అజయ్, శేఖర్, గణేశ్, గంటా శ్రీను, సురేష్, నాగు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై చట్టపరమైన చర్యలు

▸▸ జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నిర్మూలన విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు పనులకు వెళ్లే కార్మికులను గుర్తించాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. బాల బాలికలతో పనులు చేయించకూడదన్నారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలకు సంబంధించి ముద్రించిన పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, జిల్లా కార్మిక శాఖాధికారి టి.సుజాత, డీఎస్పీ షేక్ షెహబాజ్ అహ్మద్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, ఎల్‌డీఎం మాతునాయుడు, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి జి.జనార్దనరావు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి టి.సాధు పాల్గొన్నారు.

గిరిజనులను మోసం చేసిన ఆదివాసీ ట్రస్టు చైర్మన్

▸▸ గిరిజన సంఘం, ట్రస్టు కార్యదర్శి, ఉపాధ్యక్షుడు ఆరోపణ

▸▸ చింతపల్లిలో శాంతి ర్యాలీ నిర్వహించిన గిరిజనులు



చింతపల్లిలో శాంతి ర్యాలీ చేస్తున్న గిరిజనులు

చింతపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో లాభం వస్తుందని గిరిజనుల నుంచి వేలల్లో నగదు వసూలు చేసిన ఆదివాసీ ట్రస్టు చైర్మన్ మోసం చేశాడని ట్రస్టు కార్యదర్శి వండలం బాలయ్య, వైస్ చైర్మన్ కొయ్యం చిన్నబ్బాయి, గిరిజన సంఘం మండల నాయకుడు సాగిన చిరంజీవి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ ట్రస్టు నాయకులు, సభ్యులు శాంతి ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక రెవెన్యూ అధికారులు, ఏఎస్పీకి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ 2024లో కేబీ పడాల్ ఆదివాసీ ట్రస్టును ఏర్పాటు చేసి చైర్మన్‌గా ఉంటూ.. ఓవైపు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరోవైపు గిరిజనుల నుంచి ట్రేడింగ్ మార్కెట్ పేరిట నగదు డిపాజిట్లు స్వీకరించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రూ.12,200 కడితే జీవితాంతం ప్రతి నెల రూ.మూడు వేలు వస్తుందని, రూ.వెయ్యి చెల్లిస్తే ఆరు నెలలు తరువాత రూ.లక్ష చెల్లిస్తానని నమ్మించి వందలాది మంది గిరిజనుల నుంచి లక్షల్లో నగదు వసూలు చేశాడని తెలిపారు. కొన్ని నెలలపాటు ఒక్కొక్క ఐడీకి ప్రతి నెలా రూ.మూడు వేలు చొప్పున చెల్లించేవారన్నారు. కొందరు అప్పులు చేసి 15 ఐడీలు వేశారన్నారు. ఏడు నెలలుగా ఐడీలకు నెలవారీగా చెల్లించాల్సిన రూ.మూడు వేలు చెల్లించడం లేదన్నారు. దీంతో చైర్మన్ కేబీ పడాల్‌ని ప్రశ్నించగా.. తనకు సంబంధం లేదని చెబుతున్నారన్నారు. ఒక్కొక్క సభ్యుడు రూ.12,200 నుంచి రూ.30 లక్షలు వరకు కట్టుకున్నారన్నారని, ఈ నగదుకు ఎటువంటి రశీదు ఇవ్వలేదన్నారు. రూ.లక్షల్లో నగదు కట్టుకుని మోసపోయామని, తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, చింతపల్లి ఏఎస్పీ, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ట్రస్టు చైర్మన్ కేబీ పడాల్ వివరణ కోరగా.. ట్రస్టు కార్యదర్శి వండలం బాలయ్య, వైస్ చైర్మన్ కొయ్యం చిన్నబ్బాయిల బ్యాంక్ ఖాతాల్లో రూ.80లక్షలు వేశామని, నగదు రూపంలో రూ.58,20,000 ట్రస్టు విరాళాల ఇచ్చామని, ఈ నగదు ట్రస్టుకు చెల్లించాలని కోరడంతో తమపై ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, చింతపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ట్రేడింగ్ మార్కెట్ ఐడీల రూపంలో రూ.ఒక్కపైసా కూడా తీసుకోలేదని తెలిపారు. కాగా శాంతి ర్యాలీలో గిరిజన సంఘం జిల్లా నాయకుడు పాంగి ధనుంజయ్, ఆదివాసీ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

▸▸ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు హర్షణీయం

▸▸ కృష్ణంరాజు, వైఎస్.భారతిలను అరెస్టు చేయాలి

▸▸ బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పి.రవికుమార్

పాడేరురూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సాక్షి చానల్‌లో అమరావతి ఆడపడుచులపై జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్ హితవు పలికారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పచ్చకామెర్ల వారికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్న చందగా సాక్షి పత్రిక, టీవీ ఛానల్ విశ్లేషకులు శ్రీనివాసరావు, కృష్ణంరాజుల తీరు ఉందన్నారు. విశ్లేషకుడు శ్రీనివాసరావు అరెస్టు హర్షణీయమని, అదేవిధంగా కృష్ణంరాజు, వైఎస్.భారతిలను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమరావతి మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలతో రాష్ట్ర మహిళల మనోభావాలను దెబ్బతీశారన్నారు. అందుకు కారణమైన కృష్ణంరాజు, సాక్షి ఛానల్ యాజమాన్యం వైఎస్.భారతిలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మండలాల్లో యోగాంధ్రపై అవగాహన ర్యాలీలు



మినుములూరులో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు, స్థానికులు

పాడేరురూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడే యోగాపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.సాయిక్ష, జి.మనోజ్ఞ కోరారు. సోమవారం మినుములూరు పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి గ్రామంలో యోగాంధ్రాపై భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఆరోగ్య రక్షణకు యోగా సాధన ఎంతో ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి జి.సింహాద్రి, పీహెచ్ఎన్ టి.ఈశ్వరమ్మ, హెచ్‌వీ పి.వరలక్ష్మి, వైద్య, సచివాలయ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రతి ఒకరూ భాగస్వాములు కావాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగాలో ప్రతి ఒకరిని భాగస్తులను చేసేందుకు వివిధ దశల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసరావు, డీటీ చంద్రశేఖరరావు, ఎంఈవో ప్రసాద్ పాల్గొన్నారు.

సీలేరులో..

ప్రజల ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని స్థానిక వైద్యాధికారి కె.సౌమ్య అన్నారు. సోమవారం సీలేరులో వైద్యసిబ్బంది యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒకరూ రోజూలో 30నిమిషాలపాటు యోగా చేయడం చాలా మంచిదన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మస్తాన్‌వల్లి, హెచ్ఎస్ త్రినాథ్, ఏఎన్ఎం కుమారి, దేవి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల్లో తుప్పలతో తిప్పలు

తరచూ వాహన ప్రమాదాలు

చోద్యం చూస్తున్న అధికారులు





ముంచంగిపుట్టు-కుమడ రోడ్డులో ఏపుగా పెరిగిన తుప్పలు.. జోలాపుట్టు రహదారికిరువైపులా తుప్పలు

ముంచంగిపుట్టు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి జోలాపుట్టు, సంగడ, కుమడ, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లో తుప్పలు ప్రమాదకరంగా పరిణమించాయి. రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిపోయాయి. జంగిల్ కటింగ్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు.

ప్రధాన రహదారులు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగిపోవడంతో పలు చోట్ల రహదారి సరిగా కనిపించడం లేదు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చి మొక్కలు గుబురుగా పెరగడంతో వాహనాలు దగ్గరకు వస్తే గానీ గుర్తించలేని పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొన్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఇటీవల మండల కేంద్రానికి సమీపంలో గల కించాయిపుట్టు మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. అలాగే గత రెండు నెలల వ్యవధిలో ఆయా మార్గాల్లో సుమారు పదికిపైగా వాహన ప్రమాదాలు జరిగాయి. పదుల సంఖ్యలో ఆసుపత్రి పాలయ్యారు. అధికారులు స్పందించి మరిన్ని పెను ప్రమాదాలు జరగక ముందే జంగిల్ కటింగ్ జరిగే విధంగా తగిన చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

విత్తన ఎంపికతోనే అధిక దిగుబడులు



ఉప్పరాపల్లిలో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకర్

ఎస్.రాయవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తన ఎంపికతోనే అధికంగా దిగుబడులు వస్తాయని రాజమండ్రి వాణిజ్య పంటల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకరరావు అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సర్వసిద్ధి, ఉప్పరాపల్లి గ్రామాల్లో శాస్త్రవేత్తలు, అధికారులు పర్యటించారు. బీసీటీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకరరావు మాట్లాడుతూ వరిలో అయినా. కొబ్బరిలోనైనా విత్తన ఎంపిక చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం శివ, మండల వ్యవసాయాధికారిణి సౌజన్య, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్, సర్పంచులు కురందాసు గణేష్, సేనాపతి శ్రీరాములు, టీడీపీ నాయకులు తుంపాల నాగేశ్వరరావు, పడమర సతీష్, గుండుబోతుల గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో 36.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

పాడేరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో ఏజెన్సీ వాసులు ఎండ ప్రభావానికి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం వేళల్లో పొగమంచు కురుస్తున్నప్పటికీ పగలంతా వేడి, ఉక్కపోత అధికంగాను ఉంటున్నది. ఏజెన్సీలో సోమవారం కొయ్యూరులో 36.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా అరకులోయలో 35.3, పాడేరులో 35.1, డుంబ్రిగుడలో 34.2, చింతపల్లిలో 33.4, హుకుంపేటలో 32.7, అనంతగిరిలో 32.2, జి.మాడుగులలో 32.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పంపిణీకి మొక్కలు సిద్ధం



కాకరపాడు నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

కొయ్యూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పెదవలస రేంజ్ అటవీ శాఖ పరిధి లోని కాకరపాడు నర్సరీలో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఈ మొక్కలను ఉపాధి హామీ పథకంలో రైతులకు పంపిణీ చేయనున్నారు. యూకిలిప్టస్, సరుగుడు, జాప్రా వంటి లక్ష మొక్కలను పెంచారు.

జర్రెల రహదారికి మరమ్మతు చేయాలి



రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జర్రెల రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానిక సర్పంచ్ వి. నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక గిరిజనులతో కలిసి జర్రెల రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి అధికారులు, పాలకులు వచ్చి వెళుతున్నప్పటికీ అధ్వానంగా తయారైన రహదారి మరమ్మతులు చేపట్టేందుకు ఏ ఒకరూ చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అడపా లోవకుమారి, గ్రామ పెద్ద అడపా విష్ణుమూర్తి, జనసేన నాయకులు శ్రీనుబాబు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



ఇంద్రానగర్‌లో దోమల మందు పిచికారీ చేస్తున్న కార్మికులు

గూడెంకొత్తవీధి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామాల్లో దోమల మందు పిచికారీ ముమ్మరంగా జరుగుతోంది. సోమవారం రింతాడ సచివాలయం పరిధిలో ఇంద్రానగర్, నూతిబంద గ్రామాల్లో దోమల మందు పిచికారీ జరిగింది. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ గిరిజనులు ప్రతి గృహానికి ఏసీఎం 5 శాతం మందును పిచికారీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం పాపయమ్మ పాల్గొన్నారు.

ఆటోపై కూలిన విద్యుత్ స్తంభం



ఆటోపై పడిన విద్యుత్ స్తంభం

డుంబ్రిగుడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్టు కొమ్మ విరిగిపడి విద్యుత్ తీగలపై పడగా, దాని తీవ్రతతో విద్యుత్ స్తంభం ఆటోపై నేలకూలింది. అదే గ్రామానికి చెందిన గురుకృష్ణ అనే గిరిజన యువకుడి ఆటో నుజ్జయింది. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో, వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అయితే ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే కళాశాల విద్యార్థులు, గ్రామస్థులు ఊపిరి తీసుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ



డుంబ్రిగుడ రహదారిపై ర్యాలీ చేస్తున్న అధికారులు, సిబ్బంది

డుంబ్రిగుడ,జూన్9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మండల కేంద్రం డుంబ్రిగుడలో అధికారులు యోగాంధ్రపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ జాతీయ రహదారిలోని మూడు రోడ్ల కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యకరంగా ఉండవచ్చున్నారు. రోజు దినచర్యగా యోగా చేస్తే ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల యోగాంధ్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ విజయభాస్కర్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ డి.విజయ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి మధ్యలో చెట్టు తొలగింపు

ముంచంగిపుట్టు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలోని లుంగాపుట్టు సమీపంలోని ప్రమాదభరితంగా ఉన్న చెట్టును సోమవారం ఆర్అండ్‌బీ అధికారులు తొలగించారు. ఈ రహదారిలో భారీ వృక్షం రహదారికి అడ్డంగా ఒరిగి ఉండడంతో ఏ క్షణంలోని ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని భయాందోళన నడుమ స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సమస్యపై వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చెట్టును తొలగించారు.

రాయగడలో ఉగ్రతారదేవి ఉత్సవాల్లో స్పీకర్



ఉగ్రతారదేవిని దర్శించుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్లకు ఒకసారి జరిగే రాయగడ ఉగ్రతారదేవి ఉత్సవాలకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సోమవారం ఆలయం ఆవరణలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్పీకర్‌కు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి విశిష్ట పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్పీకర్ చిన్న కుమారుడు, 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, దివ్య దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఉగ్రతారదేవి అమ్మవారి ఆలయానికి అపారమైన చరిత్ర ఉందని, భక్తులకు అమ్మవారి మీద ప్రగాఢ విశ్వాసం ఉండడంతోనే ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారని చెప్పారు.

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే రాజు



సీఎం చంద్రబాబు వీసీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, అధికారులు

చోడవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాల్గొన్నారు. అన్నవరంలోని సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి వై.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్డీ మహేశ్, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్ కార్యాలయం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయం-2 మేడపై నిర్మించిన నియోజకవర్గ-2047 యాక్షన్ ప్లాన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి సోమవారం ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలోని పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు సీఎం చంద్రబాబు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం 175 నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో చంద్రబాబు నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి మోహన్‌రావు, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ రమాదేవి, వెలమ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ.కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, ఎంపీపీ రాజారాం, సర్పంచ్ యడ్ల కళావతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలంలో నర్సీపట్నం నియోజకవర్గ విజన్ స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్ కార్యాలయాన్ని ఆర్డీవో వీవీ.రమణ సోమవారం ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబునాయుడు విజన్-2047 ప్లానింగ్‌పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, తహసీల్దార్ రామారావు, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న మోహన్‌రావు, అధికారులు

మాడుగుల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు ఆదేశించారు. మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ పంటలను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలకరిలో నవ ధాన్యాల పంట వేస్తే ప్రధాన పంటకు రసాయన ఎరువులు, పురుగు మందులు అవసరం ఉండదని చెప్పారు. అలాగే పంట దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని ఏవో వాసుదేవరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పప్పుశెట్టిపాలెంలో ప్రత్యేక వైద్య శిబిరం



వైద్య శిబిరంలో జ్వర బాధితులకు తనిఖీలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

గొలుగొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వారం రోజులుగా ఇక్కడ వైరల్ జ్వరాలు విజృంభించడంతో స్థానిక నేత బెల్లపు కొండలరావు వైద్యుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ వైద్య శిబిరం నిర్వహించి, జ్వర పీడితులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. సీజన్ మారుతుండడంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని కార్యదర్శులకు ఆయన సూచించారు.



రహదారి మధ్యలోనే వేసిన మట్టి కుప్పలు, వ్యర్థాలు



ఆక్రమణలతో ఇరుకుగా మారిన కాలనీ రహదారి

సమస్యల వలయంలో అంబేడ్కర్ కాలనీ

- తుప్పలు, వ్యర్థాలు, మురుగు నిల్వలతో అధ్వానంగా కాలువలు
- రహదారులపైనే మట్టి కుప్పలు
- ఆక్రమణలతో కుచించుకుపోయిన రోడ్డు
- కాలనీ వాసుల ఇక్కట్లు.. పట్టించుకోని అధికారులు, పాలకులు

చోడవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నవరం శివారు అంబేడ్కర్ కాలనీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. ప్రధానంగా ఈ కాలనీలో మురుగునీటి కాలువలు అధ్వానంగా ఉండడంతో పాటు, రహదారులు సైతం దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాలనీలో ఎటు చూసినా, మురుగునీరు నిల్వలతో దోమలతో అవస్థలు పడుతున్నారు. కాలనీ సమీపంలో ఉన్న రామాలయానికి వచ్చిపోయే భక్తులు సైతం రోడ్డుపక్క కాల్వలనుంచి వస్తున్న దుర్గంధంతో ఇబ్బందిపడుతున్నారు. గతంలో అధికారులు, పాలకులు ఒక పద్ధతి ప్రకారం కాలువల నిర్మాణం చేపట్టకపోవడం వల్ల ఈ దుస్థితి నెలకొంది. మురుగునీటి నిల్వలు తాగునీటి బావుల్లో సైతం చేరిపోవడంతో నీరు కలుషితమవుతోంది. కాలనీవాసులు అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా, కంటితుడుపుగా వచ్చి బ్లీచింగ్ చల్లి వెళ్లిపోవడం తప్పితే, శాశ్వత చర్యలుచేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక, కాలనీకి వచ్చే రహదారులపై స్థానికులు చిన్న చిన్న బడ్డీలు, రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉంచడం, మట్టి, ఇతర వ్యర్థాలు వేయడం తదితర కాలనీకి వచ్చే రోడ్లు బాగా కుచించుకునిపోయాయి. కాలనీలోనికి ఏదైనా అత్యవసర సమయంలో అంబులెన్స్ లేదా అగ్నిమాపక వాహనం రాలేని దుస్థితి. కాలనీలో మురుగునీటి కష్టాలు తీర్చేందుకు అధికారులు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు.



వ్యర్థాలు, తుప్పలతో కుచించుకుపోయిన కాలువ... మరో కాలువలో పేరుకుపోయిన మురుగు

అంబులెన్స్ రావాలన్నా కష్టమే..



కాలనీలోని రహదారులు ఆక్రమణలతో చాలా అవస్థలు పడుతున్నాం. కాలనీలోనికి ఓ అంబులెన్స్ రావాలన్నా కష్టమే. రహదారులపై వాహనాల పార్కింగ్, కాల్వలపై బడ్డీల వల్ల రోడ్డు ఇరుకుగా తయారైంది. అధికారులు స్పందించి కాలువలు, రోడ్డు ఆక్రమణలు తొలగించడంతో పాటు, రహదారులు బాగు చేయించాలి. మురుగు నీటి కాలువలు ప్రణాళిక ప్రకారం నిర్మించాలి.

- బషీర్‌జానీ, కాలనీ వాస్తవ్యుడు

టెన్త్ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



అనకాపల్లిలో మంత్రి కొల్లి రవీంద్ర చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న దేవరాపల్లి విద్యార్థులు... బుచ్చెయ్యపేట విద్యార్థులు

దేవరాపల్లి/బుచ్చెయ్యపేట/గొలుగొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం ప్రతిభా అవార్డులను ప్రదానం చేశారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, గొలుగొండ మండలాల విద్యార్థులు ఈ అవార్డులను అందుకున్నారు.

దేవరాపల్లి మండలంలోని గుంపాన ఉదయ్‌కుమార్, మురుకుర్తి దేవానంద్, బి.హర్షిత, చెరుకూరి మౌనిక, శ్రీనాథ్ జయకృష్ణ, పెంట జయశ్యాంకుమార్ అవార్డుకు ఎంపియ్యారు. అలాగే బుచ్చెయ్యపేట మండలంలోని కాండ్రేగుల శంకర్, బుంగా మనోహర్, సింగిడి సాయికుసుమ, బి.ఈశ్వరప్రసాద్, పదిలం ఉషారాణి, కొండపల్లి శ్రీలక్ష్మి, గొకివాడ దివ్యజోతి, జనపురెడ్డి ప్రవీణ్‌లకు అవార్డులు వచ్చాయి.

అలాగే గొలుగొండ మండలంలోని కస్తూర్బాగాంధీ, అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు లభించాయి. కె.అపర్ణ, గారా జాన్‌దుర్గాబాలాజీకి, అపర్ణ, తదితరులు ఈ అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం.రమేశ్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ.కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు తదితరులు ప్రశంసాపత్రాలు, ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున నగదు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ సుధా, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా అవార్డులు అందుకుంటున్న గొలుగొండ విద్యార్థులు

ఉత్తమ విద్యార్థులకు విమానంలో విహారం

- స్పజనవాణి స్వచ్ఛంద సంస్థ అవకాశం

మాడుగుల రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవిల్లి అగ్రహారం వద్ద గల స్పజనవాణి స్వచ్ఛంద సంస్థ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు విమానంలో విహార యాత్రకు తీసుకు వెళ్లింది. ఇందులో భాగంగానే సూపర్-60 అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు కమ్యునికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస తరగతులు, నైపుణ్యం, విలువలు తదితర అంశాలతో పాటు గణితం, సైన్స్ పాఠ్యాంశాలను బోధించారు. కె.కల్పన (చోడవరం), ఎం.రోహిత్‌కుమార్ (వీరనారాయణం), కె.మోహిత్ (కేజేపురం), ఎం.గౌతమి (కేజేపురం) విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల ఒకటో తేదీన ఢిల్లీలోని రిషీహుడ్ యూనివర్సిటీలో నిర్వహించిన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌లో పాల్గొనేందుకు తీసుకెళ్లారు. అలాగే విద్యార్థులకు విద్యా వికాసానికి తోడ్పడే పలు ప్రదేశాలు చూపించారు. వాటిని ముగించుకుని సోమవారం విద్యార్థులు ఢిల్లీ నుంచి విమానంలో ప్రయాణించి విశాఖపట్నం చేరుకున్నారు. విద్యార్థులకు ప్రయాణ ఖర్చులను స్పజనవాణి సంస్థ ప్రతినిధులు బరించారు. ఢిల్లీ యూనివర్సిటీలో ట్రైనింగ్ ప్రోగ్రాంలో పాల్గొనడంతో పాటు విమాన ప్రయాణం తమకెంతో ఆనందాన్ని ఇచ్చిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రతీ విద్యార్థి సరైన మార్గ నిర్దేశత అవకాశాలతో జీవితంలో ఎంతో ఎత్తుకు చేరగలరనే నమ్మకాన్ని విమానం ప్రయాణం కలిగించిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి గ్యానీ తదితరులు ఉన్నారు.



విమానంలో ప్రయాణించిన విద్యార్థులు వీరే..

సంపద కేంద్రాలను పరిశీలించిన ఈవోపీఆర్డీ

దేవరాపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపెంట, ఎన్‌జీనగరం, వేచలం, కలిగొట్ల గ్రామ పంచాయతీల్లోని సంపద కేంద్రాలను ఈవోపీఆర్డీ అనంత ఉమాదేవి సోమవారం పరిశీలించారు. ప్రతీ సంపద కేంద్రం వినియోగంలో ఉండాలని, సేంద్రియ ఎరువు తయారీ చేస్తే సంపాదన కేంద్రంగా తయారవుతాయని ఈ సందర్భంగా సిబ్బందికి ఆమె చెప్పారు. అలాగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిరికి వెంకటరావు పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

నర్సీపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా సచివాలయాల పరిధిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్ల కార్డులతో ర్యాలీలు, యోగాసనాలతో మానవహారాలు చేశారు. ప్రాంతీయ ఆస్పత్రి వైద్య సిబ్బంది ర్యాలీలో పాల్గొని పాత మునిసిపల్ కార్యాలయం వద్ద మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సురేంద్ర, డాక్టర్ సత్యనారాయణ, ఆయుష్ విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోధ తదితరులు పాల్గొన్నారు.



యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి: ఏవో చిరంజీవి

మాకవరపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టిసారించాలని వ్యవసాయాధికారి చిరంజీవి సూచించారు. సోమవారం లచ్చన్నపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో 50 మంది రైతులు ఈ ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారన్నారు. బూరుగుపాలెం, నారాయణరాజుపేట, గిడుతూరు, కొండల అగ్రహారం గ్రామాల్లో రైతులకు నవధాన్యాల కిట్ల పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కిట్లను పొలంలో వేసుకుంటే వరినాట్లు వేసే సమాయానికి మంచి ఎరువుగా తయారువుతుందన్నారు. అనంతరం రైతులకు 30 రకాల విత్తనాలకు సంబంధించిన నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు పోతల ాంబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న ఏవో

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాతో నిఘా

నాతవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇందులో భాగంగా రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ సిహెచ్.బీమరాజుతో కలసి డ్రోన్ కెమెరా ఎగుర వేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సారా, గంజాయికి అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టామని చెప్పారు. అసాంఘక కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని కోరారు.



నాతవరంలో డ్రోన్ కెమెరా ఎగురవేస్తున్న పోలీసులు

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించండి: ఆర్డీవో

నర్సీపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను సత్వర పరిష్కరించాలని ఆర్డీవో వీవీ.రమణ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌లో 13 అర్జీలు వచ్చాయి. నిబంధనలు అతిక్రమిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిర్యాదు అందజేశారు. కోటవురట్ల మండలం చినబొడ్డేపల్లిలో నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రాజాన వరహాలదొర వినతిపత్రం ఇచ్చారు. తన కాలు లోపం వల్ల నడవలేకపోతున్నానని, ఎలక్ట్రికల్ బైక్ మంజూరు చేయించాలని రావికమతం మండలం దొండపూడి గ్రామానికి చెందిన ఎస్.రాజబాబు అర్జీ పెట్టుకున్నారు. వీటిని ఆర్డీవో పరిశీలించారు. అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలని సూచించారు.

పెట్టుబడి సాయం అందించాలి

నర్సీపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రతీ సంవత్సరం పెరుగుతున్న వ్యవసాయ పెట్టుబడిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రైతులకు సాయం అందించాలని కోరారు. దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోని పంట కాలువలు, రిజర్వాయర్లకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి కామిరెడ్డి లక్ష్మి, మండల అధ్యక్షుడు మాకిరెడ్డి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి

చోడవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సామాన్య రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాయితీపై ఎరువులు, పురుగు మందులు అందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గొలగాని మహేశ్, ముప్పిరెడ్డి శ్రీను, పల్లేల శ్యాం తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

మాకవరపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలఅగ్రహారం బల్క్‌సెంటరు వద్ద రైతుకు విశాఖ డెయిరీ డైరెక్టర్ సూర్యానారాయణ బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన అడిగర్ల మాణిక్యం గేదె మృత్యువాత పడడంతో, బీమా కింద రూ.45 వేల మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో కొత్తమల్లంపేట డైరెక్టర్ రాజకుమారి, డెయిరీ మేనేజర్ సత్యానారాయణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వేతన బకాయిల విడుదలతో ఉపాధి కూలీల హర్షం

నాతవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం వేతన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలల నుంచి ఉపాధి పనులకు కూలి అందకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నామని కూలీలు తెలిపారు. మరో రెండు, మూడు రోజులలో కూలీల ఖాతాలకు వేతన బకాయిల డబ్బులు పడతాయని అధికారులు చెప్పటంతో తమ కష్టాలు గట్టెక్కుతాయని కూలీలు ఆనందపడుతున్నారు.

నేడు పైడిమాంబ పండగ



పైడితల్లి అమ్మవారు

చీడికాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఎన్.పురం, రామ్‌నగర్ కాలనీల్లో మంగళవారం పైడితల్లమ్మ పండగను నిర్వహిస్తామని గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. శిరిజాం పంచాయతీతో పాటు ఈ ప్రాంతం ఇలవేల్పు పైడిమాంబ పండగ ఉదయం నుంచి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మంగళవారం ప్రత్యేక పూజలతో పాటు కోలాటాలు, నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

12,13 తేదీల్లో కోదండరామస్వామి భూముల కౌలుకు వేలం పాట

కోటవురట్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామస్వామి దేవస్థానానికి చెందిన భూముల కౌలు వేలం పాటను 12వ తేదీన దేవదాయ శాఖ అధికారులు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. దేవస్థానానికి చెందిన సర్వే నంబరు 28లో ఉన్న 7 ఎకరాలకు ఆ రోజు ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తారని, మూడేళ్ల కౌలుకు ఇవ్వనున్నట్టు కమిటీ పేర్కొంది. అలాగే ఈనెల 13వ తేదీన ఉదయం 11 గంటలకు కోటవురట్ల సర్వే నంబరు 100-3, సర్వే నంబరు 363లోని 9.30 ఎకరాలకు కౌలు వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు రెండు రోజులు జరిగే వేలం పాటకు హాజరు కావాలని కమిటీ కోరింది.

ఉద్యానవనమా.. డంపింగ్ యార్డా?

- అధ్వానంగా లుపిన్ పార్కు
- పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండిపోయిన వైనం
- తుప్పు పట్టిన ఆట పరికరాలు, బెంచీలు
- ఆహ్లాదాన్ని కోల్పోయిన పిల్లలు, వృద్ధులు
- రాత్రయితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- పట్టించుకోని పంచాయతీ అధికారులు




పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండిపోయిన పార్కులో తుప్పు పట్టిన ఆట పరికరాలు, బెంచీలు

పరవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ దుర్గమాంబ ఆలయం వెనుక ఏర్పాటు చేసిన లుపిన్ పార్కు అధ్వానంగా తయారైంది. ఆహ్లాదాన్ని పంచాల్సిన ఈ పార్కు ఆకతాయిలకు అడ్డాగా మారింది. నిర్వహణ లేక తుప్పలు పెరిగిపోవడంతో రాత్రయితే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పరవాడ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు లుపిన్ ఫౌండేషన్ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా 2019లో సుమారు 70 సెంట్ల స్థలంలో ఉద్యానవనం ఏర్పాటు చేసింది. వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట పరికరాలు, కూర్చునేందుకు బెంచీలు, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యానికి బోరు కూడా తవ్వించారు. నీటి సౌకర్యం పుష్కలంగా ఉండడంతో వివిధ రకాల మొక్కలను నాటి పచ్చదనాన్ని అభివృద్ధి చేశారు. కొంత కాలం తరువాత పార్కు నిర్వహణ బాధ్యతను పంచాయతీకి అప్పగించారు. కొంతకాలం పాటు నిర్వహణ బాగానే చేపట్టారు. రాను రాను నిర్వహణ బాధ్యతను గాలికొదిలేయడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. పార్కు ప్రాంగణమంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలతో పాటు ఇనుప బెంచీలు తుప్పు పట్టి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

కొన్ని ఎల్ఈడీ దీపాలు కనుమరుగుకాగా, కొన్ని దీపాల చుట్టూ తీగ లు అల్లుకుని కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలతో పార్కు కళావిహీనంగా మారింది. నడకమార్గం అధ్వానంగా తయారైంది. రాత్రుల సమయంలో మందుబాబులు పార్కును బార్‌లా వినియోగించుకుంటున్నారు. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్కు ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో వారి తీరు పట్ల స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి ఈ పార్కును అభివృద్ధి చేసి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని పరవాడ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా పార్కు ప్రాంగణం



పార్కు ప్రాంగణం అధ్వానంగా తయారైంది. పిచ్చిమొక్కలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. దుర్వాసన సైతం వెదజల్లుతోంది. పార్కులో కాసేపు సేద తీరుదామన్నా కూర్చోలేని పరిస్థితి నెలకొంది. బెంచీలు తుప్పు పట్టేశాయి. వాకింగ్ ట్రాక్ అధ్వానంగా మారింది. మందుబాబులకు అడ్డాగా మారింది.

\- ఎస్‌కే హుస్సేన్, పరవాడ

అధికారులు పట్టించుకోవాలి



పార్కు అభివృద్ధికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. పిల్లలు, పెద్దలు కాసేపు ప్రశాంతంగా గడపడం కోసం ఏర్పాటు చేసిన పార్కు ఇప్పుడు అధ్వానంగా తయారవ్వడం చాలా బాధాకరం. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి పార్కును వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలి.

\- బండారు గోపి, పరవాడ

మెట్రో రైలు కారిడార్‌లో మరో ముందడుగు

- రూ.6 వేల కోట్ల రుణ సాయం చేసేందుకు ఏఐఐబీ ఆసక్తి
- ఏఎంఆర్‌సీ ఎండీతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన



ఏఐఐబీ ప్రతినిధులకు గురుద్వారా జంక్షన్‌లో పరిస్థితిని వివరిస్తున్న ఏఎంఆర్‌సీ ఎండీ రామకృష్ణారెడ్డి

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులో మరో అడుగు ముందుకుపడింది. ఈ ప్రాజెక్టుకు సాయం చేయడానికి ముందుకువచ్చిన ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ప్రతినిధులు క్షేత్ర పర్యటనకు వచ్చారు. అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్ (ఏఎంఆర్‌సీ) మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి వారిని సోమవారం విశాఖకు తీసుకువచ్చి.. కొమ్మాది నుంచి స్టీల్‌ప్లాంటు వరకు స్టేషన్లు నిర్మించే స్థలాలను చూపించారు. ఎక్కడెక్కడ ఏమేమి నిర్మించాలనుకుంటున్నదీ వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన గురుద్వారా కూడలిలో విలేకరులతో కొద్దిసేపు మాట్లాడారు. తొలి దశలో కొమ్మాది నుంచి స్టీల్‌ప్లాంటు వరకు 34.4 కి.మీ., గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు 5.07 కి.మీ., తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకు 6.75 కి.మీ. పొడవునా మూడు కారిడార్లను నిర్మిస్తామన్నారు. కొమ్మాది-స్టీల్‌ప్లాంట్ మధ్య 29 స్టేషన్లు, గురుద్వారా-పాత పోస్టాఫీసుల మధ్య ఆరు స్టేషన్లు, తాటిచెట్లపాలెం-చినవాల్తేరుల మధ్య ఏడు స్టేషన్లు కలిపి మొత్తం 42 స్టేషన్లను నిర్మిస్తామని పేర్కొన్నారు. విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులకు తొలి దశలో రూ.12 వేల కోట్లు అవసరం కాగా ఏఐఐబీ రూ.6 వేల కోట్లను రుణంగా ఇవ్వడానికి ముందుకు వచ్చిందన్నారు. ప్రాజెక్టు చేపట్టే ప్రాంతాలు, ట్రాఫిక్, తదితర అంశాలను తెలుసుకునేందుకు విశాఖపట్నం వస్తే వారికి అన్నీ వివరించామన్నారు.

'భూమి' రైతుకు నీటి కష్టాలు!

... 5వ పేజీ తరువాయి

తదితర గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే ఆనకట్టల నిర్మాణ సమయంలో గేట్ల ఏర్పాటులో సాంకేతిక లోపంతో ఏటా వర్షాకాలంలో నీరు వృథాగా పోతున్నది. దీంతో పొలాలకు సకాలంలో పూర్తిస్థాయిలో నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ఇదిలావుండగా తాండవ షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో తాండవ నదిపై పోలవరం ఎడమ కాలువ అక్విడక్టు నిర్మాణంలో భాగంగా భూమి ఆనకట్ట వద్ద నదిలో పదేళ్ల క్రితం కొండను తలపించేంతగా వేసిన రాళ్ల గుట్టలను ఇప్పటికీ తొలగించలేదు. దీంతో ఆనకట్ట వద్ద నదిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీనికి తోడు ఆనకట్ట వద్ద నుంచి నక్కపల్లి మండలం ఉద్దండపురం వరకు ఉన్న పంట కాలువ పలుచోట్ల ఆక్రమణకు గురవడం, పిచ్చిమొక్కలు పెరిగిపోవడం, కాలువ ఇరువైపులా ఉన్న నివాసితులు వ్యర్థాలను వేస్తుండడంతో పూడిక పెరిగిపోతున్నది. ఏటా పూడిక తొలగించని కారణంగా కాలువలో నీటి ప్రవాహం తగ్గిపోయి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందని పరిస్థితి ఏర్పడుతున్నది. కాలువ చివరి భూముల రైతులు వరినాట్లు వేయడానికి వర్షంపై ఆధారపడాల్సి వస్తున్నది. 2022లో ఆయకట్టు రైతుల విజ్ఞప్తి మేరకు అప్పటి అనకాపల్లి ఎంపీ సత్యవతి ఎంపీ గ్రాంట్ రూ.10 లక్షలు మంజూరు చేయడంతో అప్పట్లో కాలువల పూడిక తీయించారు. ఇంతకు మించి వైసీపీ ఐదేళ్ల పాలనలో కాలువల్లో పూడిక తీసిన పాపాన పోలేదు. గుంటపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నియోకవర్గం ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి స్వొంత నిధులు వెచ్చించడంతోపాటు రైతుల శ్రమదానంతో పాయకరావుపేట వద్ద కాలువలో పూడికలు తీయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూమి పంట కాలువలో పూడిక, తుప్పలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నిర్ణీత గడువులో అర్జీలు పరిష్కరించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత గడువులో పీజీఆర్‌ఎస్ అర్జీలను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో సత్యనారాయణరావు, ఎస్‌డీసీలు సుబ్బలక్ష్మి, మనోరమ పాల్గొని పౌరుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి తీసుకున్న అర్జీలను సంబంధిత అధికారులు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీలో తెలిపిన సమస్యకు సంబంధించి వివరణ స్పష్టంగా తెలపాలని, అర్జీదారునికి సమస్య పరిష్కారం గురించి అర్థమయ్యే విధంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 240 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారునితో మాట్లాడుతున్న ఏఎస్పీ ఎల్.మోహనరావు

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- ఏఎస్పీ ఎల్.మోహనరావు

అనకాపల్లి రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఏఎస్పీ ఎల్.మోహనరావు ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహనరావు పాల్గొని అర్జీదారుల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. స్వయంగా వారి గోడును ఆలకించి సంబంధిత అధికారులకు బదలాయించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 25 అర్జీలు అందగా, అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి అంశాలపై వినతులు అందినట్టు జిల్లా పోలీస్ కార్యాలయ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ డి.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచల దేవస్థానం ఈవో త్రినాథ్‌కు ఆర్‌జేసీగా బదిలీ

- తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు అదనపు బాధ్యతలు

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సింహాచల దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వి.త్రినాథరావును రాజమహేంద్రవరం రీజనల్ జాయింట్ కమిషనర్, మల్టీ జోన్-1గా బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు సింహాచలం ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించాలని సూచించింది.

కాగా గత ఈ ఏడాడి ఏప్రిల్ 30న చందనోత్సవం సందర్భంగా గోడ కూలిన ఘటనలో ఏడుగురు భక్తులు మృతి చెందిన సంగతి తెలిసిందే. అప్పుడు ఆలయ ఈఓ త్రినాథరావు సెలవుపై అమెరికా వెళ్లడంతో రాజమహేంద్రవరం ఆర్‌జేసీ కె.సుబ్బారావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ ప్రమాదంపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ కె.సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని సూచించడంతో ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. దీంతో ఆ పోస్టు ఖాళీ అయింది. ద్వారకా తిరుమల దేవస్థానం ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తికి అదనపు బాధ్యతలు ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం త్రినాథరావును రాజమహేంద్రవరం ఆర్‌జేసీగా బదిలీ చేయడంతో మూర్తిని అక్కడ ఆర్‌జేసీ పోస్టు నుంచి రిలీవ్ చేశారు.

చందనోత్సవం ఎఫెక్టేనా?

ఏటా చందనోత్సవం వివాదాస్పదంగా మారుతోంది. 2023లో జరిగిన ఉత్సవంపై చాలా ఆరోపణలు వచ్చాయి. అప్పుడు ఈవోగా త్రినాథరావే ఉన్నారు. ఆయనతో పాటు ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ ఏడాది ఉత్సవంలో తొక్కిసలాట, తోపులాటలు జరిగాయి. కలెక్టర్ అంతరాలయ దర్శనాలు నిలిపివేసినా, అప్పుడు కూడా వీవీఐపీ టికెట్లను ఈవో కార్యాలయంలో విక్రయించారని, లెక్కకు మించి టికెట్లు ఇవ్వడం వల్లే పెద్దసంఖ్యలో వీవీఐపీలు అంతరాలయంలోకి వెళ్లారని అప్పటి జేసీ విశ్వనాథన్ నివేదిక ఇచ్చారు. ఈవోతో పాటు పలువురు అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తాజాగా ఈ ఏడాది కూడా చందనోత్సవం వివాదాస్పదం కావడంతో.. నాడు చర్యలు చేపట్టకపోవడం వల్లే అదే ఈవో త్రినాథరావు ఇంకా కొనసాగుతున్నారని ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఇప్పుడు ఆయనను ఈవో పోస్టు నుంచి బదిలీ చేసింది. అయితే ఇంకా ఎవరినీ నియమించకపోవడంతో ఆయనకే అదనపు బాధ్యతలు నిర్వహించాలని సూచించింది.

మహిళలను కించపరిచిన వాళ్లను కఠినంగా శిక్షించాలి

... 5వ పేజీ తరువాయి

చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ఆధ్వర్యంలో యర్రవరం, మాకవరపాలెం సర్పంచులు సత్యవతి, శిరీష సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ రేవతమ్మకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యవతి మాట్లాడుతూ, అమరావతి ప్రాంతంలో ఎక్కువ మంది దళితులు వున్నారని, వారిని కించపరిచేలా కృష్ణంరాజు మాట్లాడగా, కొమ్మినేని వంతపడారని, ఇది క్షమించరాని నేరమని అన్నారు. మతాలు, సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వీరి వ్యాఖ్యానాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, టీడీపీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో రూరల్ సీఐ రేవతమ్మకు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, తెలుగు మహిళలు

12 మంది తహసీల్దార్లు బదిలీ

... 5వ పేజీ తరువాయి

సీనియర్ అసిస్టెంట్లు, 11 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టులు, 12 మంది రికార్డు అసిస్టెంట్లు, 30 మంది ఆఫీస్ సబార్డినేట్లు, ఆరుగురు నైట్‌వాచ్‌మెన్‌ను బదిలీ చేశారు.

జలవనరుల శాఖలో 100 మంది...

జలవనరుల శాఖ విశాఖ సర్కిల్ పరిధిలో 100 మందికిపైగా వివిధ కేడర్ ఉద్యోగులను బదిలీచేశారు. ఎస్ఈ స్వర్ణకుమార్ నేతృత్వంలో సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం బదిలీలు చేశారు. కౌన్సెలింగ్ నిర్వహించకుండా బదిలీలు కోరుకునే ఉద్యోగుల నుంచి ఆప్షన్ ఫారాలు తీసుకుని తరువాత బదిలీ చేశారు. అయితే గ్రీవెన్స్ చెప్పుకునేందుకు తమను ఎస్ఈ ఛాంబర్‌లోకి అనుమతించలేదని కొందరు ఉద్యోగులు వాపోయారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులను బదిలీ చేశారు. అయితే ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకున్నవారికి బదిలీల్లో ప్రాధాన్యత ఇచ్చారనే వాదన వినిపిస్తున్నది.

భీమిలి హౌసింగ్ ఈఈగా సూరిబాబు

శ్రీకాకుళం జిల్లా టెక్కలి హౌసింగ్ డీఈ సూరిబాబుకు పదోన్నతి కల్పించి భీమిలి డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. ఇంకా విశాఖ హౌసింగ్ కార్యాలయంలో పలువురికి బదిలీలు అయ్యాయి. గాజువాక ఏఈ గోపాలకృష్ణను జిల్లా కార్యాలయానికి బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న ప్రసాద్‌ను గాజువాకకు బదిలీ చేశారు. భీమిలి ఏఈ సెలవుపై వెళ్లడంతో అతని స్థానంలో పెందుర్తి ఏఈ దీపక్‌ను బదిలీ చేసి అతని స్థానంలో పెందుర్తి రూరల్ ఏఈ నాగేశ్వరరావును నియమించారు.

తలుపులు మూసి ట్రెజరీలో బదిలీలపై కసరత్తు

జిల్లా ట్రెజరీ కార్యాలయంలో బదిలీల్లో అవకతలను సరిచేయడానికి సోమవారం మరోసారి అధికారులు సమావేశమయ్యారు. బదిలీలకు 15 మందితో నియమించిన కమిటీని రద్దుచేసి ఆరుగురితో మరో కమిటీ వేశారు. మూడు జిల్లాల డీటీవోలు, ఏటీవోలతో కూడిన కమిటీ సోమవారం మధ్యాహ్నం చర్చించారు. సాయంత్రం అయిన తరువాత డీటీవో చాంబర్ తలుపులు మూసివేసి రెండు, మూడుగంటలపాటు సుదీర్ఘంగా కసరత్తు చేశారు. అయినా రాత్రి పదిగంటలైనా బదిలీ ఉత్తర్వులు వెలువడలేదు. నాలుగు రోజుల క్రితం 34 మందిని బదిలీ చేయడం వివాదమైంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. దీనిపై ఉన్నతాధికారులు అప్రమత్తమై 34 మంది బదిలీల్లో లోపాలు సవరించాలని ఆదేశించడంతో సోమవారం భేటీ అయిన కమిటీ తమ నిర్ణయాన్ని వెల్లడించలేదు. బహుశా అర్ధరాత్రి తరువాత బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు.

ముగిసిన బదిలీల జాతర

ప్రభుత్వ శాఖల్లో సోమవారం అర్ధరాత్రికి బదిలీల హడావిడి ముగిసింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా అనేక శాఖల్లో బదిలీలు చేపట్టారు. బదిలీలకు సోమవారంతో గడువు ముగిసింది. ఈ పర్యాయం కొన్ని శాఖల్లో కౌన్సెలింగ్ నిర్వహించగా, మరికొన్ని శాఖల్లో ఉద్యోగుల ఆప్షన్ మేరకు బదిలీలు చేశారు. ఒకేచోట ఐదేళ్లు నిండిన ఉద్యోగులను విధిగా బదిలీ చేశారు. ఈ పర్యాయం ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు ఎక్కువగా అధికారులకు చేరాయి. దీంతో కొన్ని శాఖల్లో బదిలీలపై కొంత ప్రతిష్టంభన, ఇబ్బంది ఎదురయ్యాయి. కొందరు అధికార పార్టీ నేతలు.. బదిలీలకు సంబంధించి సిఫారసు లేఖలు ఇప్పిస్తామని సొమ్ములు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి.

క్రైం... crime news

రాగూర్ ఫార్మాలో కార్మికుడికి తీవ్ర అస్వస్థత

- రియాక్టర్ క్లీనింగ్ చేస్తుండగా వాంతులు
- ఆస్పత్రికి తరలించిన సహచర కార్మికులు

పరవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలో ని రాగూర్ లేబొరేటరీస్ యూనిట్-3లో జరిగిన ప్రమాదంలో కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. రియాక్టర్ క్లీనింగ్ పనులు చేపడుతుండగా ఆదివారం సాయంత్రం జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వి.మాడుగుల మండలం కేజేపురం గ్రామానికి చెందిన కె.సింహాచలం కొంత కాలం నుంచి రాగూర్ లేబొరేటరీస్ యూనిట్-3లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం ప్రొడక్షన్ బ్లాక్‌లోని రియాక్టర్‌ను ఎండీసీ స్వాలెంట్‌తో సింహాచలంతోపాటు మరో ఇద్దరు కార్మికులు కలిసి క్లీనింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో సింహాచలం నాణ్యమైన మాస్క్ ధరించకపోవడంతో రియాక్టర్ లోంచి వచ్చిన వాయువులను పీల్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వాంతులు చేసుకోవడంతో తోటి కార్మికులు తొలుత లంకెలపాలెం వద్ద ఒక క్లినిక్‌కు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం షీలానగర్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. సింహాచలం ఆరోగ్యం నిలకడగానే ఉందని పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. కాగా ప్రమాద స్థలిని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు సోమవారం సందర్శించారు. ఈ సంఘటనపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాగూర్ లేబొరేటరీస్‌లో కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సింహాచలం కోలుకునే వరకు వైద్య సేవలు అందించడంతోపాటు పూర్తిస్థాయి వేతనం చెల్లించాలన్నారు.

మనస్తాపంతో బాలుడి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక పూడిమడకరోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు సోమవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బస్తర్ గ్రామానికి చెందిన అంకిత్(16) కొన్ని రోజులుగా అనకాపల్లిలో అన్నయ్య వరుసైన సచిన్‌కుమార్ వద్ద ఉంటున్నాడు. సచిన్‌కుమార్ పూడిమడక రోడ్డులోని గ్లాస్ వర్కులో పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం అంకిత్ అన్నయ్య మన్వీర్ ఫోన్ చేసి ఇల్లు వదిలి ఎందుకు వెళ్లిపోయావని, అనకాపల్లిలో ఏం పని అని మందలించి ఇంటికి రమ్మని చెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన అంకిత్ ఆదివారం పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేయగా, కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మరిగిన నూనెతో దాడి చేసిన మహిళ అరెస్టు

లంకెలపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సహజీవనం సాగిస్తున్న వ్యక్తిపై మరిగిన నూనెతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన మహిళను పరవాడ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. జీవీఎంసీ 84వ వార్డు పరిధి సాలాపువానిపాలెంలోని అద్దె ఇంట్లో సహజీవనం సాగించిన గండికోట బాలకృష్ణ, నక్క రమణమ్మల మధ్య వ్యక్తిగత విభేదాల ఉన్నాయి. ఈ కారణంగా ఏప్రిల్ 22న రాత్రి సమయంలో రమణమ్మ మరిగిన నూనెతో బాలకృష్ణపై దాడి చేసి పరారైంది. ఈ క్రమంలో బాలకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసులో నిందితురాలైన రమణమ్మను పరవాడ పోలీసులు సోమవారం అనకాపల్లి పూడిమడక జంక్షన్ వద్ద గుర్తించి అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ వెల్లడించారు.

ఒక రోజు సమ్మెకు ఎన్ఎంయూఏ సమాయత్తం

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా 2019లో సురేంద్రబాబు జారీ చేసిన 1/2019 సర్క్యులర్‌ను ఆర్టీసీ యాజమాన్యం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విజయనగరం జోన్ పరిధిలోని ఆరు జిల్లాల్లో ఒకరోజు సమ్మెకు దిగేందుకు సమాయత్తమవుతున్నది. జోన్ పరిధిలో ఈ సర్క్యులర్‌ను జిల్లా యాజమాన్యాలు అమలు చేయడం లేదని ఆరోపిస్తూ అసోసియేషన్ సమ్మెకు పిలుపునిచ్చింది. జోన్ పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లకు బుధవారం సమ్మె నోటీసు ఇవ్వాలని రీజనల్ కమిటీ తీర్మానించింది. ఆర్టీసీలో సిబ్బంది ఏమైనా తప్పులు చేస్తే ఎలాంటి పనిష్మెంట్లు ఇవ్వాలో 2019లో సురేంద్రబాబు సర్క్యులరును విడుదల చేశారు. అయితే దీనిని జోన్ పరిధిలోని జిల్లాల్లో అధికారులు అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఎన్ఎంయూఏ ఒక రోజు సమ్మెకు సమాయత్తమవుతున్నది.

నేటి నుంచి జిల్లాస్థాయి యోగా పోటీలు

అనకాపల్లి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం నుంచి జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్టు యోగా జిల్లా నోడల్ అధికారి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్‌వీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ఈ పోటీలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో 10 నుంచి 18 ఏళ్ల వయసు కలిగి ప్రథమస్థానంలో నిలిచిన వారందరూ మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఎస్ఆర్ శంకరన్ సమావేశమందిరానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, తయారు చేసిన ఉత్పత్తుల వాడకం ఆరోగ్యకరమని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్, క్యాంటీన్‌లను ఆమె సోమవారం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, వారు పండించిన పంటకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులను లబ్ధిదారులు సంప్రతించి వారికి కావలసిన సరుకుల వివరాలు ముందుగా తెలుసుకొని వారికి సరఫరా చేయడం ద్వారా అమ్మకాలు పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి కె.శచీదేవి, ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాలెడ్జ్ హబ్‌గా ఏపీ

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.20 వేల నగదుతోపాటు మెడల్, జ్ఞాపికను అందించనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేయడం వల్ల మిగిలిన విద్యార్థుల్లో కూడా బాగా చదువుకోలనే ఆసక్తి, పట్టుదల పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ, షైనింగ్ స్టార్స్ అవార్డును స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 184 మందికి, ఇంటర్మీడియట్ విద్యార్థులు 32 మందికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో జి.అప్పారావునాయుడు, ఇంటర్ విద్యా శాఖ అధికారి బి.సుజాత, సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జయప్రకాశ్, ఆర్డీవో షేక్ ఆయాషా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పీవీజీ కుమార్, మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554